

# పరమయోగి కబీరు సందేశాలు

ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# పరమయోగి కబీరు సందేశాలు



**ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు**

**తెలుగుఅనువాదం : ఎన్.కె.పద్మావతి**


మొదటి ముద్రణ : మే, 2025

ప్రతులు : 1,000

**వెల : రూ.70/-**



**పుస్తకముల కొరకు :-**

**తటవర్తి వీరరాఘవరావు,**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**

**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) జ్ఞానమాల | - | రూ.70/- |
| 3) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 4) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 5) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 6) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 7) పంచకోశాలు | - | రూ.60/- |
| 8) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 9) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 10) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



# పత్రీ గారి పుస్తకములు

| | | |
|---|---|---|
| 1) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | - | రూ.160/- |
| 2) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | - | రూ.160/- |
| 3) యోగుల సందేశాలు | - | రూ.160/- |
| 4) జ్ఞాన సందేశాలు | - | రూ.160/- |
| 5) పత్రీజీ సందేశాలు | - | రూ.160/- |
| 6) విజ్ఞానసారం | - | రూ.160/- |
| 7) పరమయోగి కబీరు సందేశాలు | - | రూ.70/- |
| 8) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |

# హింస (మాంసాహారం)

1) “ నువ్వు గింజంత చేప తిని, కోటి ఆవులను దానం ఇచ్చినా, కాశీకి వెళ్ళి మరణించినా, నరకానికే వెళతావు.”

* * *

2) “ బాధ అనేది ఏ జీవికైనా ఒక్కటే! మూర్ఖులైన ప్రజలు గ్రహించడం లేదు ! బలి ఇచ్చే జంతువులు స్వర్గాన్ని చేరితే, తమను తామే బలి ఇచ్చుకుని స్వర్గాన్ని చేరవచ్చు కదా ” అంటున్నాడు కబీర్.

* * *

3) “ ఏ ప్రాణి యెక్క కంఠాన్ని ఎలా నువ్వు కోస్తున్నావో.... తిరిగి నీ గొంతు కూడా అలానే కోయబడుతుంది.”

* * *

4) “ అన్ని వర్ణాలు కలిసి శక్తిపూజ పేరుతో జంతువులను బలి ఇచ్చి తింటున్నారు ! హరిజనులను అంటరానివారుగా భావిస్తున్నారు. వారు నరకాన్నే పొందుతారు.”

* * *

5) “ ముస్లిం మత పెద్దలైన ఖాజీలు రోజుకు అయిదు సార్లు నమాజ్ చేస్తారు. మరోవైపు జీవులను హత్య చేస్తున్నారు. వారి నమాజ్ వ్యర్థమే కదా !”

* * *

6) కబీర్ అంటున్నాడు : “ ఓ ముల్లా ! దైవం పేరుతో నువ్వు చేసే ప్రార్థన వల్ల జీవుల భ్రమ దూరం కాదు! బ్రతికి ఉన్న జీవులను తీసుకువచ్చి వాటిని నరికి బలి ఎందుకు ఇస్తున్నావ్? ప్రాణాలు పోయలేని నువ్వు ప్రాణాలు ఎందుకు తీస్తున్నావ్? నువ్వు సరిగ్గా ఆలోచించడం మాని వేదాలు, ఖురాన్‌లు చెప్పాను అంటున్నావ్ ‘అన్నింటిలోనూ ఒకే పరమాత్మ ఉన్నాడు ’ అనే సత్యాన్ని వదిలి వాటిని వేరుగా తలచి వాటిని వేధిస్తున్నావ్. నోటితో మంత్రాలు వల్లిస్తూ కోళ్ళను, మేకలను



చంపుతున్నావ్. ప్రాణులన్నీ భగవంతునికి ప్రియమైనవే ! పాపం నుంచి నువ్వు ఎలా రక్షింపబడతావ్? హృదయ పవిత్రత లేని కారణంగా అంతటా ఉన్న పరమాత్మను గుర్తించ లేకుండా వున్నావు; నువ్వు స్వర్గం వైపు నుంచి నరకం వైపుకు వెళ్తున్నావు."

* * *

7) " మేము ఇస్లాం ధర్మం గురించి చాలా అన్వేషణ చేశాం ! దీనిని అనుసరించే వారు తెలిసి కూడా అనుచిత కార్యాలు చేస్తున్నారు. దీని అనుయాయులు అహంకారంతో మదమెక్కి అధిక గర్వంతో ప్రవర్తిస్తున్నారు; తమ స్వార్థం కోసం ఆవులను వధిస్తున్నారు. వాటిని పోషణ చేసే దాదిలా వాటి పాలను త్రాగుతున్నారు. ఆ తల్లిని ఎందుకు వధిస్తున్నారు? చిన్నపిల్లలు, అలసిపోయిన వారు వాటి పాలుత్రాగి పోషణ పొందుతున్నారు.. వాటి శరీరాన్ని కోసి మూర్ఖులైన జనులు తింటున్నారు. బుద్ధిహీనులైన వీరు జ్ఞానహీనులు. మిథ్యా అహంకారంతో భ్రమించి వీరు తిరుగుతున్నారు. సమస్త జంతువుల పట్ల ఎవరి హృదయంలోనైతే కరుణ ఉంటుందో వారే విశాల హృదయులు. అటువంటి విశాల హృదయం లేకుండా ఈశ్వర దర్శనం అనే స్వర్గం ఎలా లభిస్తుంది?"

* * *

8) "ప్రజలందరూ తమ స్వస్వరూపాన్ని మరచిపోయి షట్ దర్శనాలలో మునిగిపోయారు. వేషధారణ, నటించటంలోనే ఉండిపోయారు. బౌద్ధులు, శాక్తేయులు, నాస్తికులు నిజమైన తెలివిలేనివారు. జైనులుకు జీవం విషయాలలో సరియైన జ్ఞానం లేదు. వారు ఆకుల్ని కోసి దేవాలయాలకు తెస్తారు. దవనం, మరువం, సంపంగి మొదలైనవి కోటి జీవాలకు సమానమైనవి. గరిక, గడ్డి మొక్కలు భూమి యొక్క వెంట్రుకల లాంటివి ! వాటిని లాగటం వలన భూమికి బాధ కలుగుతుంది. ఈ విధంగా వారు కోటి జీవాలను హత్య చేస్తున్నారు. జైనులు వీర్యం యొక్క ఒక్క బిందువును కూడా స్ఖలనం కానివ్వరు. షడ్ దర్శనాలలోనే వారు ఊగిసలాడుతున్నారు. 'జ్ఞానం' అనే అమర పదవికి ఎవరు దూరంగా ఉన్నారో వారు ఈశ్వరునికి దూరమైపోతారు. ఎవరైతే ఈ రహస్యాన్ని తెలుసుకున్నారో వారు ఈశ్వరునికి అత్యంత సమీపంగా ఉంటారు."

* * *

9) " స్మృతులు గుణ అవగుణాల గుర్తించి పాపపుణ్యాల నిర్ధారణ చేస్తాయి; స్మృతులు, వేదాలు నిరంతరం చదివే పండితులు అహంకార పూరితలై ఉంటున్నారు. వేదాలను చదువుతున్నారు. కేవలం వేదాలనే ప్రశంసిస్తున్నారు. వారి సందేహాలు తీరటం లేదు... ఆత్మ పరమాత్మ, సంసార రహస్యాలు వారు తెలుసుకోలేక పోతున్నారు.. శాస్త్రాలు చదివి వారు జీవులను వధిస్తున్నారు. వారు పశువుల

శిరస్సును ఖండించి, దేవుళ్ళ ముందు పెడుతున్నారు. కబీర్ అంటున్నాడు: ఇదంతా బూటకం. ఎన్ని జీవులను సతాయించినా ఆత్మానుభవం యొక్క వాస్తవికతను వారు పొందలేరు! హింసాధర్మాన్ని పాటించే వాళ్ళు జీవిత పర్యంతం ఆత్మ స్వరూపాన్ని లక్ష్యం చేసుకోలేరు."

* * *

10) " ఓ ఫకీరూ ! ఈశ్వరుడు ఏ వేషంలో ఉంటాడో ఆ విషయం చెప్పు! యాత్ర కోసం ఎక్కడకు వెళ్తున్నావు? ఎక్కడ మజీలీ చేస్తున్నావు? ఏ రూపానికి నమస్కారం చేస్తున్నావు? " " ఓ ముసల్మానూ..! నేనూ నిన్ను అడుగుతున్నాను అల్లా ఎరుపుగా ఉంటాడా? పసుపుగా ఉంటాడా? లేక అనేక రంగుల్లో ఉంటాడా? ఓ కాజీ (ముస్లిం మతగురువు) ! నువ్వు ఎలాంటి కార్యం చేయిస్తున్నావు? ఇంటింటా గేదెల్ని హత్య చేయిస్తున్నావు! మేకల్ని, కోళ్ళను కోసి చంపే ఆదేశాన్ని ఎవరు ఇచ్చారు? ఎవరి ఆదేశం మేరకు నువ్వు కత్తిని ఝుళిపిస్తున్నావు? జీవ జంతువుల పీడను అర్థం చేసుకోలేకపోతున్నావ్ .. 'ధర్మ గురువు ' అని వ్యర్థంగా అనిపించుకుంటున్నావు! నువ్వు నిజమైన ముస్లిం అని భ్రమపడుతున్నావు. ముస్లింలు పగలు ఉపవాసం చేస్తారు. రాత్రి ఆవులను చంపుతారు. ఒకవైపు రక్తం మరియొక వైపు ప్రార్థన. అటువంటి పనిపట్ల భగవంతుడు ఎందుకు సంతోషపడతాడు !"

## సద్గురువు

1) " గురువుకు కోటి కోటి ప్రణామాలు చేయి; కీటకానికి తుమ్మెద గురించి తెలియదు. అయినా తుమ్మెద కీటకాన్ని తనలా చేస్తుంది. అలాగే శిష్యుణ్ణి గురువు తనంతటి వాడిగా చేస్తాడు."

* * *

2) " గురువు కుమ్మరివాడు, శిష్యుడు కుండలాంటివాడు; లోపలి నుంచి చేత్తో ఆసరా ఇస్తూ బయటి నుంచి దెబ్బలు కొడుతూ శిష్యుడిని సరిచేస్తూ ఉంటాడు గురువు."

* * *

3) " శిష్యుడు కత్తి, గురువు పదును పెట్టేవాడు; గురువు శబ్దాలు అనే సానరాయిపై శిష్యుణ్ణి పెట్టి పదును పెడ్తాడు; ఎవరైతే గురు శబ్దాల యొక్క రాపిడిని సహిస్తూ అతని దగ్గరే ఉంటారో అతడే నిజమైన శిష్యుడు."

* * *

4) “ భూమిని అంతటినీ కాగితంలా చేసి, అడవులు అన్నింటినీ కలంలా చేసి, సప్త సముద్రాలను సిరాగా చేసి వ్రాసినప్పటికీ గురువు యొక్క గుణాలను వర్ణించలేం !”

* * *

5) “గురువు, గోవిందుడు నీ ముందు నీ ముందు నిలబడితే ముందు ఎవరికి నమస్కరిస్తావు? గోవిందుణ్ణి చేరటానికి దారి చూపించిన గురువుకే ముందు నమస్కరించాలి !”

* * *

6) “ నేను .. ఉన్నప్పుడు గురువు లేడు; ఇప్పుడు గురువు వున్నాడు కానీ, నేను లేను; ప్రేమ మార్గం బహు ఇరుకైనది; అందులో ఇద్దరు ఉండటానికి వీల్లేదు.”

* * *

7) “ ఎప్పుడైతే నీ హృదయంలో జ్ఞాన ప్రకాశం ఉదయిస్తుందో, భ్రమల భాండాగారం నశిస్తుందో.. ఎప్పుడైతే అపూర్వమైన స్వరూప జ్ఞానం ప్రాప్తిస్తుందో.. అప్పుడే సద్గురువు లభించిన విషయాన్ని గ్రహిస్తావు.”

* * *

8) “సద్గురువు సత్యాసత్యాల భేదాన్ని చెప్పేవాడు; అది తెలుసుకున్న శిష్యుడే ధన్యుడు; అతని భాగ్యమే భాగ్యము.”

* * *

9) “ ప్రజలు శాస్త్రాలు చదవటం, పాండిత్యం సంపాదించటం యోగం, యజ్ఞం, తపస్సులు చేస్తున్నారు; కోటి ఉపాయాలు చేసినప్పటికీ సద్గురువు లభించనట్లైతే ఏ జ్ఞానాన్నీ పొందలేరు,”

* * *

10) “నిజమైన గురువు సాంగత్యంలో నీ మనస్సును జోడించి; అప్పుడే నీ చంచలత్వం దూరమై నిశ్చలత్వం పొందుతావు; జనన మరణ చక్రం నుంచి విడుదల పొందుతావు.”

* * *

11) “ ‘గు’ అంటే అంధకారం; ‘రు’ అంటే ప్రకాశం. అజ్ఞానాన్ని పోగొట్టి ఎవరైతే జ్ఞానాన్ని ఇస్తారో వారి పేరే ‘గురువు’.”

* * *

12) “ గురువు నీ తనువు మనస్సులలో ఉండే తాపాన్ని పోగొడతాడు; ఎప్పుడైతే సుఖదుఃఖాలకు అతీతమైన స్థితిని పొందుతావో నీకు నువ్వుగా గురువు రూపంలో ప్రకటితమవుతావు.”

* * *

13) " దేశ దిశాంతరాలు నేను తిరిగినప్పుడు మనుష్యులకు కొరత లేదు; ఎవరి దర్శన మాత్రం చేత సుఖం కలుగుతుందో అటువంటి సద్గురువుల కొరత కనిపించింది."

* * *

14) " గురువు వారణాసిలో ఉన్నప్పటికీ, శిష్యుడు సముద్ర తీరంలో ఉన్నా.. శిష్యుని శరీరంలో గురువు యొక్క గుణాలు వుంటే ఒక్క క్షణం కూడా ఎడబాటు ఉండదు."

* * *

15) " శిష్యుని మనస్సులో ఉన్న ప్రీతినీ, ఆర్తినీ గమనించి గురువు ఉపదేశం చేస్తాడు; గురువు సమక్షంలో ఎప్పుడూ విముఖంగా ఉండకు.

* * *

16) " గురువు ద్వారా జ్వలించబడిన అగ్ని – సముద్రం శరీరంలో జ్వలిస్తోంది; విషయ వాసనలు అనే పక్షులు ఒడ్డున కూర్చుని ఉన్నాయి. ఒకసారి కాలిన దేహం మళ్ళీ పుష్పించదు; ఆ పక్షులకు శరీరంలో ప్రవేశించే అవకాశమే లేదు."

* * *

17) " ప్రపంచంలోని వైవిధ్యాన్ని చూడటం కోసం ఈ ప్రపంచంలోకి వచ్చాను; గురుకృప వలన అనుపమానమైన బ్రహ్మ యొక్క దర్శనం కలిగింది."

* * *

18) "గురువు కృప వలన ఏ జీవుడైతే ముందే మరణిస్తున్నాడో అతనికి మరణం అనేది తియ్యని అనుభూతి; కర్తృత్వ భావన ఎప్పుడైతే మరణించిందో కర్మ కూడా లేకుండా పోయింది; అనేకమైన స్మృతులను చేసే దేహరూప స్త్రీ కూడా మరణిస్తోంది; అహంకారం, గౌరవం అనేవి మరణిస్తాయి; అభిమానం మరణిస్తోంది; ఆత్మారాముణ్ణి తెలుసుకుని ఏ జనులైతే మరణిస్తున్నారో వారు అమరులు."

* * *

19) " ఓ బాబా ! ప్రజలంతా చెట్టును వదిలి కొమ్మలను పట్టుకుంటున్నారు; శరీరం అనే యంత్రం పట్ల ముగ్ధులై ఉన్నారు. జీవితం అంతా నిద్రపోతూ గడిపేస్తున్నారు. చివరి సమయంలో తెలివి తెచ్చుకుంటున్నారు. దేవాలయాలకు వెళ్ళడం వలన దేవి ప్రతిమ కనిపిస్తుంది. తీర్థస్థలాలకు వెళితే కేవలం నీరు కనిపిస్తుంది. నీకు వున్న స్వల్పబుద్ధితో పలికే మాటల వలన పరమగతి ప్రాప్తించదు; గోచరం కాదు. ఎన్నో జన్మల నుంచి నిద్రపోతున్న ప్రజలకు సాధువులు చెప్పే భగవత్ తత్వం అర్థం కాదు. బావిలో నీళ్ళుతోడే పాత్రలాగా బంధించపబడి జనన

మరణ చక్రంలో తిరుగుతున్నారు. గురువు ఒక్కడే ఈ ప్రపంచానికి భరోసా ఇచ్చేవాడు; వేశ్య ఇంటి నుంచి వచ్చిన పుత్రుడికి తండ్రి ఎవరని చెప్పగలం? ఈ జగత్తును విరోధించి సద్గురువు అమృత వాక్కులు వినడానికి ప్రయత్నం చేశాను. వెతకగా వెతకగా సద్గురువును పొందాను; జనన మరణ చక్రం నుంచి విడుదల పొందాను.”

* * *

20) “ గురువు ఉపదేశం యొక్క దెబ్బ నా శరీరం, మనస్సులలో సరియైన స్థానంలో తగిలింది ! దాని వలన నాకు తెలిసిన జ్ఞానం అంతా మరుపుకు వచ్చింది! బుద్ధి నష్టపోయింది. మతి వికలమైపోయి పిచ్చిదై పోయింది. మూడు గుణాలు నాశనమైపోయాయి. దేహం విదేహమై పోయింది. ఏ అవయవాలైతే చంచలంగా ఉండేవో అవి చలనం లేకుండా అయిపోయాయి. నేను అక్కడ, ఇక్కడ, పది దిక్కులు, నా అంతరంలో నాకు గాయం చేసిన పనిని చూశాను. ఇదంతా ఏదో ‘గుప్తవిద్య’ అనిపించింది. ఎవరి శరీరంలో అయితే ఈ బాధ ఉంటుందో! వారే నన్ను అర్థం చేసుకోగలరు. కబీరు భగవంతుని మోసంచే మోసగించబడ్డాడు. అతని సమస్తం శూన్యంలో కలసిపోయింది.”

* * *

21) కబీరు అంటున్నాడు : “ నా గురువు భ్రమరం లాంటివాడు; ఇతర కీటకాలను తనలా రూపాంతరం చేస్తాడు. ఆ ఇతర కీటకాల పూర్తి రూపం భ్రమరంలా అయిపోయింది. గురువు జాతి ప్రాంతాల భేద భావాన్ని చూడడు; అతడు భక్తుని యొక్క సంసారిక బంధనాలను భగ్నం చేస్తాడు. ఏ విధంగానైతే నదులు, కాలువలు అన్నీ గంగలో కలిసి పోయి గంగాజలంలా మారిపోతాయో, నది సాగరంలో కలసి విడదీయనట్లు అయిపోతుందో అదే విధంగా గురు సంపర్కంలో జీవుడు తన మలినత్వాన్ని పోగొట్టుకుని పరిధులు లేనివాడుగా అయిపోతాడు. చంచల మనస్సు సుస్థిరమవుతుంది. అది అంతరాత్మలో నివసిస్తుంది. తత్త్వంలో శాశ్వతత్వం అంతటా పరమాత్మ దర్శనం కలుగుతుంది. అతడు జీవుని యొక్క బంధనాలను పోగొట్టి నిర్బంధునిగా చేస్తాడు; గురువు గమ్యం లేనివాడికి గమ్యాన్ని ఇస్తాడు; రాముని రంగులో రంగుగా మారుస్తాడు.”

## కర్మఫలం

1) “ శరీరం పొలం లాంటిది; మనస్సు రైతులాంటిది; పాప పుణ్యాలు విత్తనాల లాంటివి; నువ్వు ఏ విత్తనాన్నైతే నాటుకుంటున్నావో దాని ఆధారంగానే మరు జన్మలో ఫలం వస్తోంది.”

* * *

2) “చెడు పనులు చేసి సుఖాన్ని కోరుకుంటే అది ఎలా వస్తుంది? మర్రిచెట్టు విత్తనం విత్తితే మామిడి పళ్ళు ఎలా లభిస్తాయి?”

* * *

3) “ చేయాల్సింది అంతా చేసి, దేవుళ్ళకు మొక్కితే ఉపయోగం ఏముంది? పొలంలో విత్తనాలే చల్లకపోతే కర్మఫలం ఎక్కడుంది?”

* * *

4) “శరీరాన్ని ధరించి ప్రారబ్ధాన్ని అందరూ అనుభవించాల్సి ఉంది; జ్ఞాని దుఃఖాన్ని సంతోషంగా అనుభవిస్తే అజ్ఞాన్ని ఏడుస్తూ అనుభవిస్తాడు.”

* * *

5) “ చేసిన కర్మ ఎప్పుడూ నిష్ఫలం కాదు; సప్తసముద్రాలు అడ్డుగా ఉన్నప్పటికీ సమయం వచ్చినప్పుడు ఆ ఫలం అంది తీరుతుంది.”

* * *

6) “ కలికాలంలో కర్మకు ఫలితం వెంటనే లభిస్తుంది; రైతు కుడిచేత్తో నాగలిని పట్టుకుని ఏ విధంగా విత్తుతాడో అదే ఫలాల్ని కోసుకుంటాడు.”

* * *

7) “ ఏడు ద్వీపాలు, తొమ్మిది ఖండాలు, మూడు లోకాలు, బ్రహ్మాండంలో దేహాన్ని ధరించి కర్మఫలాలను అందరూ అనుభవించాల్సిందే.”

## వాక్కు

1) “ మనస్సు లో అహంకారం లేకుండా ఇతరులకు చల్లదనాన్ని, స్వయంగా నీకు కూడా హాయినిచ్చే మాటలు మాట్లాడు.”

* * *

2) “ జాగ్రత్తగా మాట్లాడు! ఇష్టం వచ్చినట్లు మాట్లాడకు. మాటలకు కాళ్ళు చేతులు ఉండవు! ఒక శబ్దం అమృతంగా ఉంటుంది. మరొక శబ్దం గాయం చేసేదిలా ఉంటుంది.”

* * *

3) “ కాకి ఎవరి ధనాన్ని అపహరించింది? కోయిల ఎవరికి ఏం ఇచ్చింది? తియ్యని శబ్దాలు వినిపించి ప్రపంచాన్ని తనదిగా చేసుకుంది.”

* * *

4) “ ఎవరి నాలుకైతే వారి వశంలో ఉంటుందో వారికి ప్రపంచం వశమవుతుంది; లేకపోతే అవలక్షణాలు ఉత్పన్నమవుతాయి.”

* * *

5) “ వచ్చేటప్పుడు తిట్టు ఒకటిగానే ఉంటుంది; బదులుకి బదులు చెప్పినప్పుడు అది అనేకం అవుతుంది; అలా చెప్పకపోతే అది ఒక్కటిగానే ఉంటుంది.”

* * *

6) “ఎలాంటి భోజనం తింటే అలాంటి మనస్సు తయారవుతుంది; ఎలాంటి నీరు త్రాగితే అలాంటి వాణి తయారవుతుంది.”

## కాలం

1) “ కాలం అనే తాడుతో నీ కాళ్ళు కట్టివేయబడి ఉంటే నువ్వు సుఖంగా, విశ్రాంతిగా ఎలా నిద్రపోగలవు? శ్వాస అనే మృత్యువు పగలు రాత్రి మ్రోగుతూ ఉంది; సావధానుడవు కా.”

* * *

2) “ రేపు చేయాల్సిన పనిని ఈ రోజే చేయి; ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేయి; క్షణంలో ప్రళయం రావచ్చు; ఇంక ఎప్పుడు చేస్తావు;”

* * *

3) “ రాత్రంతా నిద్రతోనూ, పగలంతా తినటంతోనూ అయిపోతుంది; అమూల్యమైన వజ్రం లాంటి మానవ జన్మను గవ్వలా చేసుకుని బ్రతుకుతున్నావు.”

* * *

4) “ కాలచక్రం అనే తిరగలిలో అనేక రాత్రులు పగళ్ళు గడిచిపోయాయి. భగవంతుడు సాకారుడా? నిరాకారుడా? అనే దాంట్లోనే జీవులు ఇంకా కొట్టుకుంటున్నారు,”

* * *

5) “ ఈ శరీరం పచ్చికుండ లాంటిది; దాన్ని వెంటేసుకుని తిరుగుతున్నావు.. కాలం యొక్క ఒక్క దెబ్బ తగిలితే పగిలి పోతుంది. చివరకు ఏమీ మిగలదు!”

* * *

6) “ తోటమాలిని చూసి మొగ్గలు అనుకుంటున్నాయి: వికసించిన పూలు ఈ రోజు కోయబడుతున్నాయి; రేపు మనవంతు వస్తుంది.”

* * *

7) “నరుడు నారాయణ స్వరూపుడు; కేవలం శరీరధారి కాదు; ఈ శరీరం ధూళిలో కలిసిపోయేలోపే తెలుసుకోవాల్సింది తెలుసుకో.”

* * *

8) “ఈ చిన్ని జీవితం కోసం ఏం సంపాదిస్తున్నావు? ఏం సంగ్రహం చేస్తున్నావు? ప్రజలందరూ శరీరం, ఇల్లు, సంపద, రాజ్యం వదిలిపెట్టి వెళ్ళిపోతూనే

ఉన్నారు."

* * *

9) " ప్రజలారా మేల్కోండి ! నిద్రపోకండి! నిద్రను ప్రేమించకండి! రాత్రి నిద్రలోని స్వప్నంలాంటిదే ఈ ప్రపంచం కూడా."

* * *

## దానం

1) " దానం చేయటం వలన ధనం ఏమీ తగ్గిపోదు; నదిలోని నీరు ఎంత వాడినా ప్రవహిస్తూనే ఉంటుంది! స్వయంగా దానం చేసి చూడు."

* * *

2) "వసంత ఋతువు అడగ్గానే చెట్లన్నీ తమ ఆకుల అన్నింటిని ఇచ్చేస్తాయి; తొందరలోనే వాటిమీద కొత్తకొత్త ఆకులు వచ్చేస్తాయి; ఇచ్చింది ఎప్పుడూ నిష్ఫలం కాదు."

* * *

3) " పడవలో నీరు నిండినప్పుడు ఇంటిలో ధనం ఎక్కువ ఉన్నప్పుడు వెంటనే రెండు చేతుల్తో దానిని బయటకు పారబోయాలి; ఇదే బుద్ధిమంతుల పని."

* * *

4) " చావనైనా చస్తాను కానీ ఈ శరీర స్వార్థం కోసం ఎవ్వరినీ యాచించను.. కానీ, పరమార్థం కోసం అడుగవలసి వస్తే నేను సిగ్గు పడను."

## మనస్సు

1) "మనస్సు చెప్పినట్లు నడువకు! మనస్సులో అనేక మాటలు వుంటాయి! ఎవరైతే మనస్సును తన ఆధీనంలో ఉంచుకుంటారే వాడే నిజమైన సాధువు."

* * *

2) "మనస్సు పరిగెడుతూనే ఉంటుంది; పరుగెత్తే మనస్సు... అలసి స్థిరమైతే ఇంతవరకు దేనికోసమైతే పరుగెత్తిందో ఆ వస్తువు తనలోనే ఉందని అర్థం చేసుకుంటుంది."

* * *

3) "సముద్రంలోని అలల కంటే ఎక్కువగా మనస్సులో ఆలోచనలు వుంటాయి! మనస్సు తనలో తాను శాంతమైతే తనలోనే ఉన్న వజ్రం లభిస్తుంది."

* * *

4) " నీ మనస్సుకే ప్రబోధించు ! ఉపదేశం; ఎవరైతే మనస్సును వశం చేసుకుంటారో వారికి ప్రపంచం అంతా శిష్యరికం చేస్తుంది."

* * *

5) " శరీరం అరటి తోట లాంటిది; మనస్సు మత్తుతో నిండిన ఏనుగులాంటిది; జ్ఞాన రత్నం అనే అంకుశంతో మనస్సు అనే ఏనుగును తన వశంలో ఉంచుకున్న వాడే నిజమైన సాధువు."

* * *

6) " మనస్సుకు మంచి చెడులు రెండూ తెలుసు! తెలిసి కూడా చెడు పనులు చేస్తుంది ! చేతిలో దీపం ఉన్నప్పటికీ నూతిలో పడేవాడికి ఏ విధంగా శాంతి లభిస్తుంది?"

* * *

7) " శరీరం దేవాలయం లాంటిది. మనస్సు ధ్వజం లాంటిది. ధ్వజం విషయాలనే గాలితో ఎగురుతూ ఉంటుంది. మనస్సు చెప్పినట్లు శరీరం వింటే సర్వస్వం నష్టపోతాం."

## ఆత్మానుభవం

1) " తనలో ఉన్న ఆత్మను తెలుసుకోలేక వాచక జ్ఞానులు కేవలం మాటల ద్వారా ప్రకటిస్తారు; తనలోని వస్తువును గుర్తించకుండా దాని కోసం బయట వెదుకుతారు."

* * *

2) "ఆత్మానుభవం పొందితే సంతోష విషాదాలు ఉండవు; వాదోపవాదాలు వదలిపెట్టి చిత్రంలోని దీపంలా స్థిరంగా ఉంటుంది."

* * *

3) " మనస్సు మత్తులో ఉంటే ఏం మాట్లాడతాం? వజ్రం లభించినప్పుడు దాన్ని మూటలో దాచుకుంటాం కానీ, అస్తమానూ తెరచి వుంచుకుంటామా? త్రాసు సమం అయిన తరువాత ఎందుకు తూస్తావు? మధువు మత్తులో వున్న వ్యక్తి ఏం మాట్లాడతాడు? హంసకు మానససరోవరం లభిస్తే చిన్న చిన్న చెరువుల వైపు ఎందుకు చూస్తుంది? ఈశ్వరుడు లభిస్తే ఈ మత్తులోనే ఉంటారు."

* * *

4) "శరీరం లోపలే మనస్సు అంతర్ముఖమైంది; బయటకు వెళ్ళటం లేదు;

విషయ వాసనలు అనే జ్వాల నీరులా చల్లగా మారిపోయింది; అశాంతిగా ఉన్న మనస్సు ప్రశాంతంగా మారిపోయింది."

* * *

5) " దేని కోసమైతే నేను భూమి మీదకు వచ్చానో ఆ వస్తువు నాలోనే లభించింది; ఏదైతే నాకు అన్యంగా ఉందని అనుకున్నానో అదిప్పుడు నాదైంది."

* * *

6) కబీరు అంటున్నాడు : " దైవాన్ని వెదుకుతూ నన్ను నేను కోల్పోయాను. సముద్రం బిందువులో కలిసి పోయింది. అతనిని ఇప్పుడు ఎలా వెదకగలను?"

* * *

7) " ఆ అద్భుతాన్ని నీ హృదయంలోనే రహస్యంగా ఉంచు; వేదాలు, ఖురాను కూడా ఆ అనుభూతిని వర్ణించలేదు ! నువ్వు చెప్పినా ఎవ్వరూ విశ్వసించరు."

* * *

8) "ఏ వనంలో అయితే సింహం తిరగలేదో.. పక్షులు ఎగరలేవో.. 'రాత్రి', 'పగలు' అనే స్థితి ఉండదో.. అక్కడ కబీర్ నివాసం ఏర్పరచుకున్నాడు."

అంతరార్థం : " సహస్రార స్థితిలో ఏదైతే ఉందో అక్కడ మనస్సు అనే సింహం తిరగలేదు; ఇంద్రియాలనే పక్షులు ఎగరలేవు; రాత్రి పగలు అనే ధ్యాసే ఉండదు; అక్కడ కబీర్ లయమై ఉన్నాడు."

* * *

9) "ఓ మనసా! ఎక్కడికి కావాలి అనుకుంటే అక్కడకు వెళ్ళు! నీపై ఏ ఆంక్షలు విధించను. మనస్సు ఎక్కడకు వెళ్ళినా అక్కడ రామ నివాసమే అనిపిస్తుంది. హరిపాద చిహ్నాలను గుర్తించి మనస్సు అక్కడే విశ్రాంతి తీసుకుంటోంది; మనస్సు శరీరం పట్ల అనురక్తి ఉన్నప్పుడు ఎక్కడ చూసినా ద్వైతమే కనిపించేది. జ్ఞానం లభించిన తరువాత ఎక్కడ చూస్తే అక్కడ ఈశ్వరుడే కనిపిస్తున్నాడు. అతనిలో లీనమై శరీరాన్ని మరచిపోతోంది.. చివరకు దానికి సుఖసాగరం లభించింది."

* * *

10) " నేను దేన్నైతే పొందానో దానితో సరిపోల్చ దగిన వస్తువు లభించింది! అది అందరిలోనూ వ్యాపించి ఉంది! ఆ చైతన్యం రంగులేనిది, ఖండింపబడనది. అవినాశి. దానిని తూచలేము. మూల్యము లేదు. దానిని కొలవలేము. లెక్కించలేము. అది బరువైనదీ కాదు తేలికైనదీ కాదు. అది అసలు పోల్చేది కాదు! నీటిలో నీరు కలసిపోతే ఒక్కటిగా ఎలా ఉంటుందో అలానే అతనిలో మనం వున్నాం.. మనలో అతనున్నాడు! ఈ మార్గాన్ని తెలుసుకున్నవారికి మరణం లేదు... తెలుసుకోకుండానే చాలామంది మరణిస్తున్నారు. కబీరు ప్రేమరసాన్ని పొందాడు; కానీ దాన్ని త్రాగటానికి

ఎవ్వరూ రావటం లేదు! భగవంతుని వాక్యాన్ని గుర్తించకపోతే ఏ ప్రమాణాన్ని చూపించలేను.

* * *

11) " ఎవరైనా రాముణ్ణి గురించి చెప్పండి; అగోచర వస్తువును చూపించమంటే ఎలా? రామనామ వర్ణన అందరూ చేస్తారు కానీ, రామ నామ మర్మం తెలుసుకోలేరు. పై పై మాటల వలన ఉపయోగం లేదు; ఎవరికైతే అనుభవం వున్నదో వారికే సుఖం లభిస్తుంది" అని కబీరు అంటున్నారు." సత్యం గురించి చెప్పటానికి ఏమీలేదు; పరిచయం లేకుండా దాని మర్మాన్ని ఎవ్వరూ తెలుసుకోలేరు."

* * *

12) " నా మనస్సు అనే వాయిద్యం మ్రోగటం లేదు. నా మనస్సు ఇక నాట్యం చేయటం లేదు; (..చంచలత్వం సమాప్తమైపోయింది..) తృష్ణా రూప పాత్ర ముక్కలైపోయింది; నా తపన అంతా తీరిపోయి మనసంతా ఆ పరమతత్వంలో నిండిపోయింది! హరిస్మరణంతో నా వాయిద్యం తడిసిపోయింది! (విషయాకర్షణ తగ్గిపోయింది). భ్రమరూపకరిణి (మృదంగం శబ్దం చేయటానికి ఉపయోగించే పదార్థం) ఊడిపోయింది! బ్రహ్మాగ్నిలో (జ్ఞానాగ్ని) మమత, గర్వం అభిమానం (అహంకారం) కాలిపోయాయి! కామరూపం అనే వస్త్రం ఇప్పుడు పాతదైపోయింది! ఇప్పటివరకు నేను ఎన్ని రూపధారణలు చేసానో, ఇప్పుడు వాటి అవసరం లేదు, కర్మలన్నీ కాలిపోయాయి. ఇంద్రియాలన్నీ శాంతించాయి! రామ నామంతో కర్మల మసి అంతా శుభ్రపరచబడింది; మనస్సులో ఏ చంచలత్వమైతే ఉందో, ఏ వాద వివాదాలైతే వున్నాయో అవన్నీ శాంతించాయి. నాపై రాముని యొక్క కృప ఉన్న కారణంగా పరమతత్వం యొక్క సాక్షాత్కారాన్ని పొందాను."

* * *

13) "ఓ ప్రభూ! ఎప్పుడైతే నేను బైరాగిని అయ్యానో అప్పటి నుంచి నా చేతనత్వం రామునితో ఉండిపోయింది. బ్రహ్మ కిరీట ధారణ చేయకముందే, విష్ణువు నామాన్ని ధరించక ముందే, శివశక్తులు ఇంకా జన్మించక ముందే... నేను యోగాన్ని నేర్చుకున్నాను! సత్యయుగంలో పావుకోళ్ళు (పాదుకలు) ధరించి, త్రేతాయుగంలో సంచి, లాఠీ పట్టుకుని, ద్వాపరంలో కౌపీనాన్ని ధరించి, కలియుగంలో వివిధ క్షేత్రాలలో తిరుగుతూ బైరాగిలా వుంటానని ప్రమాణం చేశాను. గురువు యొక్క ప్రతాపంతో మరి సత్ సాంగత్యంతో మనస్సును జయించి అమరగఢ్ (ఎక్కడైతే వ్యక్తి అమరత్వాన్ని పొందుతాడో ఆ స్థానం) వచ్చాను." కబీర్ అంటున్నాడు ! " ఓ అవధూతా! విను నేను నిరంతరం అభయ పదాన్ని పొందుతూ ఉన్నాను."

* * *

# భగవంతుడు

1) " హిందువులు రాముడు వేరని, ముస్లింలు ఖుదా వేరనుకుంటున్నారు; ప్రతి ప్రాణి హృదయంలో చేతనా రూపంలో ఉన్నవాడే రాముడు.. అల్లా."

* * *

2) " ఏ విధంగానైతే కస్తూరి మృగం తన నాభిలో వున్న కస్తూరిని తెలుసుకోలేక దాని కోసం బయట గడ్డిలో వెదుకుతూ ఉంటుందో... అలాగే నువ్వు కూడా నీలో ఉన్న భగవంతుని కోసం బయట వెతుకుతున్నావు."

* * *

3) "నీ మాయ తెరను తొలగిస్తే నీలోనే ఉన్న భగవంతుణ్ణి కలుసుకోవచ్చు! అందరిలోనూ అదే సాయి విరాజిల్లుతున్నాడు కనుక పరుష వచనాలు పలుకకు! అంధకారంగా ఉన్న నీ హృదయంలో ఆత్మజ్యోతిని వెలిగించు; దివ్యనాదాలు వింటూ ఆ ఆనందంలో తన్మయుడవు కా."

* * *

4) " ప్రియుడు దూరంగా వేరే దేశంలో ఉంటే ఉత్తరం వ్రాయాలి కానీ, అతడు నా శరీరంలో, మనస్సులో, కళ్ళలోనే ఉన్నప్పుడు సందేశం పంపించాల్సిన అవసరం ఏముంది?"

* * *

5) "భగవంతుడు అంటున్నాడు " నన్ను ఎక్కడ అని వెతుకుతున్నావు? నేను నీ దగ్గర ఉన్నాను. దేవాలయాల్లోనూ, మసీదుల్లోనూ నేను లేను. కాబా కైలాసాల్లోనూ లేను. నా కోసం చేసే ఏ క్రియా కర్మల్లోనూ లేను; ఏ యోగ వైరాగ్యాలలోనూ లేను. ఒక్క క్షణపు వెతుకులాటలో వెంటనే లభిస్తాను. నీ ప్రతి శ్వాసలో శ్వాసగా నేను వున్నాను."

* * *

6) " ఏ విధంగానైతే నువ్వుల్లో నూనె ఉంటుందో, ఏ విధంగానైతే చెకుముకి రాళ్ళల్లో అగ్ని ఉంటుందో.. అలాగే నీ సాయి నీలో ఉన్నాడు. మేల్కొని చూడు."

* * *

7) "ఏ విధంగానైతే కంటిలో కంటిపాప ఉంటుందో.. అలాగే భగవంతుడు ఈ శరీరంలోనే ఉన్నాడు. ఈ సత్యం తెలుసుకోకుండా మూర్ఖప్రజలు బయట వెదుకుతున్నారు."

* * *

8) “ అంతా నువ్వే అని నేను అనుకున్నప్పుడు నేను ఎక్కడా లేను. అహంకారం సమసింది ఎక్కడ చూసినా అంతటా నువ్వే ఉన్నావు.”

* * *

9) “భగవంతుణ్ణి నువ్వు ఏ రూపంలో కొలిస్తే ఆ రూపంలోనే లభిస్తాడు. మంచినీరు మాత్రమే దాహాన్ని తీరుస్తుంది కానీ మంచు బిందువు దాహం తీర్చదు అని, తెలుసుకో.”

* * *

10) “ మార్గం పొడవుగా ఉంది. ఇల్లేమో దూరంగా ఉంది. దారి చాలా కష్టంగా ఉంది. ఇలా ఉంటే హరి దర్శనం ఎలా కల్గుతుంది?”

* * *

11) కబీరు ఇలా అంటున్నాడు: “ ఓ రామా! నీకు నీ భక్తులు అంటే ఇష్టం వుంటే నా ఈ అనుమానాలన్నీ తీర్చు. బ్రహ్మ గొప్పవాడా? అన్నింటినీ ఉత్పన్నం చేసినవాడు గొప్పవాడా? వేదాలు గొప్పవా? ఎక్కడ నుంచి అవి ప్రకటితమయ్యాయో అది గొప్పదా? మనస్సు గొప్పదా? లేక దేంట్లోనైతే మనస్సు లయమవుతోందో అది గొప్పదా? రాముడు గొప్పవాడా? లేక రామ తత్వాన్ని తెలుసుకున్నవారు గొప్పవారా? తీర్థాలు గొప్పవా? లేక హరిదాసుడు గొప్పవాడా?

* * *

12) కబీర్ అంటున్నాడు: “ నేను చైతన్యంగా అన్నింటిలోనూ వ్యాపించి వున్నాను. సృష్టిలో వున్న, సమస్తం నా భిన్న భిన్న రూపాలే. నన్ను ‘కబీర్’ అంటారా? ‘రాముడు’ అని అంటారా? ఇద్దరమూ ఒక్కటే. నేను బాలుణ్ణి కాను.. వృద్ధుణ్ణి కాను.. నాకు పిల్లలూ లేరు.. నేను ఎక్కడికీ వెళ్ళను. ఎక్కడకూ రాను. సహజంగా ఉంటాను. భగవంతుడే సాలెవాడు నేసినటువంటి ఓ దుప్పటిలోని ప్రోగులలాంటి వాళ్ళమే మనమందరము. త్రిగుణాలకు అతీతమైన స్థితిలో నేను వున్నాను. ఆ కారణం చేతనే నేను ‘రాజా రాముణ్ణి’ అయ్యాను. నేను ప్రపంచాన్ని చూస్తున్నప్పుడు మోహంతో చూడటం లేదు.” అటువంటి అద్భుత స్థితిని ‘కబీర్’ పొందాడు.

* * *

13) “ శాస్త్రాలు చదివిన పండితుణ్ణి అడుగు ‘గోవిందుడు ఎవరు?’ అని! నీ గురువు ఎవరు? ఎవరు శిష్యుడని? తన స్వరూపాన్ని తెలుసుకున్నవాడు ఒంటరిగానే ఉంటాడు. ఆత్మారాముడు తండ్రిలేకుండా గొడ్రాలి నుంచి పుట్టాడు. కాళ్ళు లేకుండా చెట్లెక్కగలడు. జీను లేకుండా గుఱ్ఱాన్ని.. కవచం లేకుండా ఏనుగును ఎక్కగలడు. బీజం లేకుండా అంకురించగలడు.. కాండం లేని వృక్షంలా శాఖలు లేకపోయినా ఫలాలు ఇస్తాడు.. రూపం లేని స్త్రీ.. పుష్పం లేని పరిమళం.. నీళ్ళు

లేని నిండిన సరోవరం లాంటివాడు. దేవాలయంలేని దేవుడు, పత్రాలు లేని పూజ, పూరేకులు లేకుండానే భ్రమరాన్ని ఆకర్షించేవాడు. ఎవరైతే శూరులో వారే ఈ పరమపదాన్ని చేరతారు. కీటకాల లాంటి వారు కాలిపోతారు. ఇది దీపం లేని జ్యోతి; జ్యోతిలేని దీపం. నాదం లేని అనాహతం; ఎవరిలో చైతన్యం వుందో వారు మేల్కోండి! ఆత్మారాముడిలో లయమవ్వండి."

* * *

14) పరిమళం పుష్పంలో ఎలా వ్యాపించి ఉంటుందో.. భగవంతుడు వస్త్రంలోని రంగులా సర్వత్రా వ్యాపించివున్నాడు. పంచతత్వాలతో దేహాలను నిర్మించి అందులో 84 లక్షల జీవాలను సృష్టి చేశాడు. అన్నింటిలోనూ తాను స్థిరంగా ఉంటూ వాటిలో భిన్న భిన్న భావాలను ప్రవేశపెట్టాడు.ఎలాగైతే పాత్రలను బట్టి అగ్ని విశిష్టను పొందుతుందో, అలానే పరమాత్మ శరీరాల అనుగుణంగా ప్రవేశించాడు. నీటిలో వున్న జీవాలన్నీ నీటినుంచి విడిగా లేవు. ఆత్మలన్నీ శరీరపరంగా నివసిస్తున్నాయి, పరబ్రహ్మ గురించి తెలుసుకో! ఆత్మపరంగా అందరూ సమానమే అన్న విషయాన్ని ఎప్పుడైతే తెలుసుకున్నావో అప్పుడే మనకు నిర్వాణ పదం లభిస్తుంది. భగవంతుడు ఎప్పుడు లభిస్తాడో అప్పుడు దుఃఖ దోషాలన్నీ దూరమై మనస్సుకు సంతోషం లభిస్తుంది.

* * *

15) కబీర్ అంటున్నాడు: " హరి నీ హృదయంలోనే ఉన్నాడు. అతడిని ఎక్కడ పొందాలని అనుకుంటున్నావు? ఈ విషయం మర్చిపోయి భ్రమలోపడి బయట ప్రపంచంలో వెతుకుతున్నావు. కడుపు నింపుకోవటం కోసం ధర్మోపదేశాలు చేస్తున్నారు. అలాంటి వారి జీవితం వ్యర్థం. తనలో ఉన్న ఆత్మారాముణ్ణే తెలుసుకోలేకపోతున్నారు. ఇక పరమాత్మను ఎలా తెలుసుకుంటారు? దాహం వేస్తేనే నీళ్ళు తాగుతారు. అసలు దాహమే లేకపోతే అతడు నీళ్ళు ఎందుకు తాగుతాడు? జిజ్ఞాసతో ఎవరు వెదుకుతారో వారికే అవినాశి అయిన భగవంతుడు లభిస్తాడు. వెదకకపోతే లభించడు. ఆధ్యాత్మిక సాధన కత్తి అంచు మీద నడవడం లాంటిది. మనస్సును బాహ్యం నుంచి మరల్చినప్పుడే పరబ్రహ్మ లభిస్తాడు. ఆ విధంగా ఎవరు చేస్తారో అతడే నా గురువు."

* * *

16) కబీర్ అంటున్నాడు : " ఓ మనసా! బయటకు వెళ్ళకుండా శరీరంలోనే ఉండు. నీ హృదయ సరోవరంలోనే అవినాశి అయిన భగవంతుడు వున్నాడు. శరీరంలోనే కోటి తీర్థాలు వున్నాయి. శరీరంలోనే కాశీ ఉంది. ఈ సాధన చేస్తే శరీరంలోనే కమలాపతి, వైకుంఠవాసిని దర్శించగలవు. శ్వాసను గమనించడం

ద్వారా సహస్రార చక్రంలో నివాసి కాగలవు. తీర్థరాజైన (ఇడ,పింగళ, సుషుమ్నల త్రివేణి) గంగానది ఒడ్డున నివాసం ఉంటావు. ( నీ శరీర) ఆకాశంలో సూర్యుడు, చంద్రుడు అనే రెండు (కళ్లు) నక్షత్రాలు వున్నాయి. వాటి నడుమ వ్యతిరేక దిశలో తెరుచుకునే ఒక చిన్న తలుపు ఉన్నది (మూడవ కన్ను). జ్ఞాన సహాయంతో పంచ వికారాలను దూరం చేసుకుని ఆత్మస్థితిలో సదా విరాజిల్లు.

* * *

17) జ్ఞానం విషయంలో భ్రమలో పడి ప్రజలు మోసపోతున్నారు. ఎవరికి చెప్పను. సగుణంలో నిర్గుణంలో గుణం వుంది. వాద ప్రతి వాదాలతోనే ప్రజలు సగుణ నిర్గుణ విషయాలలోనే తిరుగుతున్నారు. పరమతత్త్వం అజరామరం, అమరం అని చెప్తూ ఉంటారు కాని, అది చెప్పేది కాదు. ఎవరైతే రూపానికీ, వర్ణానికీ పరంగా ఉన్నారో, అతనే ప్రతి శరీరంలోనూ వ్యాపించి వున్నాడు. పిండము బ్రహ్మాండ రూపంలో అతని గురించి అందరూ చెప్తుంటారు. కానీ, అతనికి ఆది, అంతం లేదు. ఎవరైతే అండపిండ బ్రహ్మాండాలకు పరంగా ఉన్న సత్యాన్ని తెలుసుకున్నాడో అతడే భగవంతుడు.

* * *

18) కబీర్ అంటున్నాడు: "ఆత్మతత్త్వం గురించి ఆలోచిస్తున్నప్పుడు అందరిలోనూ ఒకే పరమాత్మ ఉన్నప్పుడు ఎవరు పండితులు? ఎవరు యోగి? ఎవర్ని రాజు అంటావు? ఎవరిని పేద అంటావు? ఎవరు వైద్యుడు? ఎవరు రోగి? ఈ అందరిలోనూ ఒకే బ్రహ్మతత్వం వుంది. ఆత్మ ఆత్మతో ఆడుకుంటోంది. ఆడించేది ఆత్మే. అనేక రకాలైన శరీర నిర్మాణం చేసి అనేక రూపాలలో ఆత్మ పదార్థము విరాజిల్లుతోంది. ఇంక ఇప్పుడు ఎవ్వరితోనూ వైరము లేదు. కామ క్రోధాలు నశించాయి. నేను ప్రపంచమంతా తిరిగాను నిర్గుణ తత్త్వాన్ని ఎవ్వరూ చెప్పటం లేదు. ఇప్పుడు జ్ఞాని మరియు పండితుడు కలసి ఆ పరమతత్త్వం యొక్క గుణగానం చెయ్యండి.

* * *

19) "ఓ గోవిందుడా! నువ్వు నిరంజనుడివి. నీకు రూపు రేఖలు లేవు. నీ రూపం ముద్ర కాదు, మాయా సముద్రం కాదు, శిఖరం కాదు, భూమి కాదు, ఆకాశం కాదు. అక్కడ సూర్య చంద్రుల్లో ఏ ఒక్కటీ కాదు. గాలి కూడా కాదు. నాదం కాదు, వాయిద్యం కాదు, కాలం కాదు, శరీరం కాదు. వీటికంటే ముందే వున్నావు. నువ్వు జపం, తపం, యోగం, ధ్యానం, పూజ కూడా కాదు. శివుడవు కావు. శక్తివి కావు. మిగిలిన దేవుళ్ళూ కావు. 4 వేదాలూ కావు. వ్యాకరణం కూడా కాదు. నీ విషయం ఏంటో నీకే తెలుసు కనుక కబీరు నీ శరణు పొందాడు."

* * *

20) ఓ జీవుడా! నీ హృదయములో వెదుకు. హృదయంలో ఉండే ప్రియతముణ్ణి వెదుకు. కంగారు పడకు. ధనం, ఇల్లు, మిత్రులు, స్త్రీ ఎవ్వరూ నీ సహాయకులు కారు. గురువులు, న్యాయాధిపతి, పండితులు, ఫకీర్లు వీరంతా నీ బుద్ధిని నాశనం చేశారు. ఖురాను, ధర్మ గ్రంధాలు చదవటం వలన చింతలు దూరం కావు. కొంచెం సేపు స్థిరత్వాన్ని ( ఆలోచనారహిత స్థితి..) పొందితే భగవంతుడు లభిస్తాడు. బుద్ధిహీనులైన వారు అసత్యం గురించి వాగటంలోనే ఆనందం పొందుతారు. ఒక సత్యాన్వేషకుడు చెప్పేదాంట్లో నిజం ఉంటుంది. నమ్మండి. సృష్టికర్త సమస్త దృశ్య రూపాలలోనూ విరాజిల్లుతున్నాడు. అల్లా పవిత్రుడైతే నువ్వు అపవిత్రుడవు ఎలా అవుతావు? అంతా బ్రహ్మమే అయినపుడు బ్రహ్మం కంటె వేరుగా ఏమీ లేదు. కబీర్ భగవంతుని కృప వల్ల ఏం చేయాలో అదే చేస్తున్నాడు."

* * *

21) " ఓ అల్లా రామ్ నువ్వు లేకుండా నేను జీవించలేను. నాపట్ల దయ చూపించు. తీర్థ స్థలాల్లో స్నానం చేయటం వలన ఏం లాభం? శరీరాన్ని నేలకు ఆనించడం .. సాష్టాంగ నమస్కారం.. చేయటం వలన ఏం వస్తుంది? అవగుణాలను దాచి నటిస్తూ దీనులైన వారిని సతాయిస్తున్నారు. అటువంటి వారు జపతపాదులు చేసినా ఏం ఉపయోగం వుంటుంది? మసీదులో శిరస్సు వంచి నమాజు చేయటం వలన, ఏం లాభం? ఉపవాసాలు చేయటం వలన, నమాజు చదవటం వలన, హజ్, కాబా వెళ్ళటం వలన ఏమీ ఫలితం ఉండదు. బ్రాహ్మణులు 24 ఏకాదశ వ్రతాల్ని, ఖాజీలు రమ్‌జాన్ మాసవ్రతాన్ని చేస్తుంటారు. మిగిలిన 11 నెలలు ఎందుకు వదిలేస్తున్నారు? అన్ని మాసాలు సమానమేగా! భగవంతుడు మసీదుల్లో మాత్రమే ఉంటే మిగతా ప్రపంచమంతా ఎవరిది? తీర్థాలలోనూ, విగ్రహాలలోనూ రాముడు ఉన్నాడు అంటారు. అయితే ఈ రెండింటిలో ఏది నిజం తూర్పు వైపున హరినివాసస్థానమా? పశ్చిమాన అల్లా యొక్క నివాసమా? మరి అయితే మిగతా మూడు దిక్కులలో ఎవరు ఉంటున్నారు? హృదయంలో వెతకగా హృదయం లోపలే ఈ అల్లా, రాముడు కనపడ్డాడు. ఎంతమంది స్త్రీ పురుషులైతే వున్నారో అందరిలోనూ అదే భగవంతుడు వున్నాడు. కబీర్ అల్లా, రాముడు ఇద్దరి యొక్క బిడ్డ. హరి నా గురువు, మరి ప్రియతముడు కూడా !"

* * *

22) కబీర్ అంటున్నాడు : " మంచి గంధంతో ఏమి ఉంటే అవి తమ స్వరూపాన్ని కోల్పోయి అవి కూడా గంధంలా సువాసన వెదజల్లుతాయి. పరుశువేది రాయితో ఏ లోహాన్ని సృజించినా అది తన రూపాన్ని కోల్పోయి బంగారంలా

అవుతోంది. గంగా నదిలోకి ఏ నీరు వచ్చి కలిసినా తన రూపాన్ని వదలిపెట్టి గంగా జలంలా రూపాంతరం చెందుతుంది. ఎవరైతే రాముడు (ఆత్మారాముడు) అంటున్నారో వారు పరివర్తనం చెంది రాముడిలా అయిపోతారు. కబీరు రాముడిలా మారిపోయాడు. నువ్వెప్పుడు అలా అవుతావు? సోదరా !”

* * *

23) “ ఓ పరమగురూ ! నీ హృదయంతో ఆలోచించు. నాకు సహాయం చేయి. నవనాడులను ఒక తంత్రిలాగా చేసి ఈ శరీరాన్ని ఒక వాయిద్యంలా అలంకరించాను. నాకు సత్యం ఏదో అసత్యం ఏదో తెలియదు. నువ్వు ఈ వాయిద్యాన్ని ఎలా వాయిస్తావో అలాగే పలుకుతుంది. కామక్రోధాది దొంగలు నీ ద్వారా సృష్టించబడినవారే. నీ ఆజ్ఞతోటే వారు ఈ శరీరాన్ని దోచుకుంటున్నారు. వారు చేసిన అపరాధానికి నన్నెందుకు పట్టుకుంటున్నావ్? ఇందులో నా తప్పేం ఉంది? నేను వచ్చినప్పుడు నాకు ఏమీ తెలియలేదు. ఓ భగవంతుడా నాది ఒక విన్నపం ఏదైతే నువ్వు అయి ఉన్నావో అదే నేను కూడా అని తెలుసుకునీ, ఏ విధంగానైతే నీటిలో కలసిపోయిన నీరు మళ్ళీ ప్రత్యేకంగా బయటకు కనిపించదో అదే విధంగా కబీర్ యొక్క మనస్సు పరమాత్మలో లీనమ పోయింది. ”

* * *

24) “ ఓ మనసా! నువ్వు ఎక్కడకు వెళ్ళిపోయావ్? నువ్వు వెళ్ళిపోవటం వలన నాకు వైరాగ్యం వచ్చింది. పంచ తత్వాలతో ఈ శరీర నిర్మాణం జరిగింది. కానీ, ఈ పంచతత్వాలు ఎక్కడి నుంచి ప్రాప్తించాయి? జీవుడు కర్మకు వశీభూతుడంటారు. కానీ, జీవుణ్ణి కర్మలకు వశీభూతుడిగా చేసింది ఎవరు? ఆకాశంలో శూన్యం ఉంది. పాతాళంలో శూన్యం వుంది. దశదిశల్లోనూ శూన్యమే వుంది. ఆనందం యొక్క మూలమైన పురుషోత్తముడు శాశ్వతుడు. శరీరం నష్టపోతుంది కాని శూన్యతత్వం ఎప్పుడూ నష్టపోదు. భగవంతుడిలో శరీరం వున్నది. ఈ శరీరంలోనే భగవంతుడు వున్నాడు. అతను ఉన్నాడు మరి లేడు కూడా. హరి నామాన్ని విడిచిపెట్టొద్దు. సహజంగా జరిగేది జరగనీ, సహజంగానే అనుభూతికి అందుతాడు.”

* * *

25) ఓ చిత్తమా మేలుకో ! ఏ చింతన ద్వారా అయితే తన, పర అనే భేద భావం వుండదో ఆ చింతన చేయి! హరి నా హృదయంలో జ్ఞానాన్ని వెలిగించాడు. దాంతో మాయ అంతా తొలిగిపోయింది. ఆ పరమాత్మ దగ్గర నాదం లేదు.. బిందువు లేదు.. రాత్రి – పగలు లేవు.. నరనారి భేదం లేదు..జాతి కుల భేదం లేదు! కబీరు అంటున్నాడు, “ పరమాత్మ గతించనివాడు (నశించని) అగోచరమైనవాడు, భేదభావం

లేనివాడు, సమస్త సృష్టికర్తగా ఉన్నవాడు, అందరికీ ఆనందాన్ని ఇచ్చేవాడు.”

* * *

26) “ ఓ అల్లా! ఓ అగోచర నిరంజన దేవా! నీ సేవను నేను ఏ విధంగా చేయను? విస్తరింపచేసేవాడు విష్ణువు. ప్రపంచాన్ని నిర్మించేవాడు కృష్ణుడు. బ్రహ్మాండాన్ని ధరించినవాడు గోవిందుడు అయితే యుగయుగాల పర్యంతము వ్యాపించి ఉన్నవాడు రాముడు. ఎవరైతే ధర్మాన్ని నిర్మించారో వారు అల్లా అయి ఉన్నారు. శరీరంలోని 10 ద్వారాలను తెరచుకునేట్లు చేసేవాడు ఖుదా. 84 లక్షల జీవరాశులను పాలించేవాడు కరీము. జ్ఞానం ద్వారా పరమతత్వాన్ని పొందేవాడు గోరఖుడు. మనస్సులోని భావాలను గ్రహించేవాడు మహాదేవుడు. సాధనను చేసేవాడు సిద్ధుడు. మూడు లోకాలను పాలించేవాడు నాధుడు. సిద్ధులు, సాధువులు పైగాంబరులు ఎవరైనా కానీ వారంతా ఒకే తత్వాన్ని జపిస్తున్నారు. వేషాల వరకే భిన్నంగా ఉన్నారు. అపార తత్వానికి అనంతమైన పేర్లు గల ఒకే ఒక పరమ తత్వమే భగవంతుడు.

* * *

27) “ ఈశ్వరుడు దగ్గరే ఉన్నాడు. అతడు దూరంగా ఉన్నాడు అని ఎందుకు అంటున్నావ్? ఎవరైతే ద్వంద్వాలను దాటుతాడో అతడే సుందర తత్త్వము పొందుతాడు. ఎవరైతే మనస్సుతో యుద్ధం చేస్తారో,అహర్నిశలు కాల చక్రముతో పోరాటం చేస్తారో వారే మౌలానా. కాల చక్రం యొక్క అహంకారాన్ని ఎవరైతే మర్ధనం చేస్తారో అలాంటి మౌలానాకు సదా ప్రణామాలు. ఎవరైతే శరీరం గురించి ఆలోచించకుండా పగలు రాత్రి బ్రహ్మాగ్నిని ప్రజ్వలితం చేస్తున్నారో, కలలో కూడా వీర్యస్ఖలనం జరగనివ్వరో అటువంటి కాజీకి ముసలితనం మరణం వంటివి ఉండవు. ఎవరైతే శరీరం లోపలకు బయటకు వస్తూపోతున్న ఉచ్ఛాస, నిశ్వాసలను వశపరచుకున్న అతడే సుల్తాను. మూడవకన్ను ద్వారా తనలోని గగనమండలంలోని ఆ సుల్తాను తలపై ఛత్రాన్ని (విశ్వశక్తి) ధరిస్తాడు. హిందువులు రామ నామము ఉచ్ఛారణ చేస్తారు. ముసల్మానులు ఖుదా అంటున్నారు. కానీ, కబీర్ యొక్క స్వామి ప్రతి శరీరంలోనూ ఉన్నాడు.”

* * *

28) హిందువుల, ముస్లింల విధానాలకంటే నా విధానం వేరు. నా అల్లా నిరంజనుడు. నేను వ్రతాలు చేయను మొహరమ్‌లు చేయను. “ఎవరైతే (ఆత్మ) స్మరణలో ఉంటారో వారు చాలా ప్రశాంతంగా ఉంటారు ” నేను పూజలూ చేయను, నమాజు చేయను. నిరాకరుడైన వానికొక్కడికే నేను హృదయంలో నమస్కారం చేస్తాను. నేను హజ్ యాత్రలు చేయను. తీర్థయాత్రలు, పూజలు చేయను. ఎవరిని

తెలుసుకుంటే రెండవదానిని తెలుసుకోవాల్సిన అవసరం ఉండదో అతనిని తెలుసుకున్నాను. కబీర్ అంటున్నాడు : " నా సమస్త భ్రమలూ నష్టమైపోయాయి. ఒక్క నిరంజనుని పట్లే నా హృదయం ఏకీకృతమై ఉంది."

* * *

29) " మనుష్య శరీరం ఎంతో భాగ్యం వల్ల లభించింది. (శరీరాన్ని సద్వినియోగం చేసుకో) అందుచేత చాలా ఆలోచించి హోలి ఆడు. అతడు నాలుక లేకుండాగానే రసపూరితమైన గుణాల గురించి పాడగలడు. కాళ్ళు లేకుండా పైకి వెళ్ళగలడు. చేతి సహాయం లేకుండానే వేణువుని వాయిస్తాడు. ఆ పరమతత్వాన్ని ఈ చర్మ చక్షువులు లేకుండగానే దర్శించగలడు. చంపకుండానే మనస్సు మృతి చెంది వెళ్ళకుండానే బూడిదలో కలిసిపోతుంది. ప్రమిద లేకుండానే అఖండ జ్యోతి వెలుగుతుంది. దేన్నీ యాచించకుండానే అంతా ఇవ్వబడుతుంది. అక్కడ పాపపుణ్యాల స్పర్శ ఉండదు. అక్కడ సూర్యచంద్రులు కూడా ఉండరు, అక్కడ ఆది అంతాలు ఉండవు. అక్కడ కబీర్ వసంత రాగాన్ని పాడుతున్నాడు."

* * *

30) కబీర్ అంటున్నాడు. " ఈ జీవులు ఎక్కడ నుంచి వస్తున్నారు? ఎక్కడకు వెళ్తున్నారు? ఆకాశంలో శూన్యం, పాతాళంలో శూన్యం, దశ దిశల్లోనూ శూన్యమే ఉంది. ఆనందం యొక్క మూల పురుషోత్తముడు శాశ్వతుడు, దేహం నశించినప్పటికీ శూన్యమవ్వడు. పంచతత్త్వాలతో ఈ దేహం తయారు చేయబడింది. ఆ తత్వాలను ఎవరు తయారు చేశారు? నువ్వు జీవుణ్ణి కర్మబద్ధుడు అంటున్నావు. కానీ, కర్మ జీవుణ్ని దీనున్ని చేసింది. భగవంతునిలో శరీరం వున్నది, శరీరంలో భగవంతుడు వున్నాడు. సర్వత్రా నిరంతరం అతడే ఉన్నాడు. నేను హరి నామాన్ని వదలను సహజంగా ఏదైతే అవుతుందో అదే అవనీ."

* * *

31) " ఎవరైతే మనస్సు నుంచి అహంకారాన్ని విడిచిపెట్టేశారో ఆ ప్రజలు మాత్రమే భవసాగరాన్ని దాటగలరు. కొంతమంది 'మేము జ్ఞానులం' అంటున్నారు! మరి కొంతమంది 'త్యాగులం' అంటున్నారు; మరి కొందరు మేం ఇంద్రియాలను జయించాం అంటున్నారు! ఈ విధంగా అందరూ అహంకారగ్రస్తులుగా ఉన్నారు. కొందరు మేం యోగులం అంటున్నారు. మరికొందరు 'భోగులం' అంటున్నారు ! నేను అనే అహంకారం దూరం కాలేని ఆ రోగులు ఎలా జీవిస్తారు? కొందరు 'మేము దాతలం' అంటున్నారు! మరికొందరు 'తపస్వులం' అంటున్నారు! వారు ఆత్మతత్వాన్ని ఆ నామం యొక్క మర్మాన్ని తెలుసుకోలేదు. వారు మాయలో పడి మునిగిపోతున్నారు. కొందరు 'నేను యుక్తిని (తర్కం) తెలుసుకున్నాను' అంటున్నారు;

మరికొందరు జీవించే పద్ధతిని తెలుసుకున్నాం అంటున్నారు. వీరికి ఆత్మదేవుని యొక్క పరిచయం కలుగలేదు. ఇవన్నీ మిథ్యా కథనాలు. కొందరు అంటున్నారు 'మేము అన్ని ధర్మాలనూ ఆచరించాము, మరి అన్ని వ్రతాలనూ చేశాము అని. అహంకారం అనే మెలి (ముడి) పడిపోయింది. కర్మఋణం యొక్క బరువు తలపై పడి ఉంది. గర్వం, మిడిసిపాటు అన్నింటినీ విడిచిపెట్టు. 'నేను కర్తను' అనే గొప్పలు చెప్పుకోకు! ఎవరైనా హరిపాదాలను చేరాల్సిందే. లేదా భగవంతుని స్థానాన్ని పొందాల్సిందే."

* * *

32) కబీరు యొక్క ఆరాధ్య దైవం స్వయంగా అంటున్నాడు: "ఓ మానవా! నన్ను నువ్వు ఎక్కడని వెదుకుతున్నావు? నేను నీ దగ్గరనే ఉన్నాను. నేను దేవాలయాల్లో లేనూ, మసీదుల్లోనూ లేనూ, కాబా కైలాసాలలోనూ లేను. నేను ఏ క్రియా కర్మలలోనూ లేను, ఏ యోగ వైరాగ్యాలలోనూ లేను. వెదకినంత మాత్రంలోనే క్షణకాలంలోనే వెంటనే లభిస్తాను. ఓ సాధూ! విను. నేను నీ శ్వాసలో శ్వాసగా ఉన్నాను."

* * *

33) " మూర్తి పూజను అందరూ చేస్తారు. నిత్యం సేవలు చేస్తారు. ఏ దేవునికైతే రూపనిర్మాణం లేదో అతని సేవను ఎవరు చేస్తారు? పూర్ణ బ్రహ్మం అఖండితుడు! అతను జగత్తుకు స్వామి. జనులు ఈ భావాన్ని తెలుసుకోలేకపోతున్నారు. "నిరంజనునికి పది అవతారాలు' అంటున్నారు.. కానీ, ఎవ్వరూ కూడా అతనిని తమవాణ్ణి చేసుకోలేకపోయారు. అలా చెప్పబడిన అవతారుడు కూడా తాను చేసిన కర్మలను భోగిస్తున్నాడు కానీ వాస్తవిక కర్త మరొకడు. యోగి, యతి, తపస్వి, సన్యాసి తమలో తాము దెబ్బలాడుకుంటున్నారు. 'ఎవరైతే ఆత్మారాముని (నిర్గుణం) వంక చూస్తారో వారే తరిస్తారు " అని కబీరు అంటున్నాడు.

* * *

34) " ఆ పరమాత్మ అలక్ష్యుడు ఎవ్వరి మీద ఆధారపడిలేడు. మాయా రహితుడు. అతనిని ఎవ్వరూ తెలుసుకోలేరు. అతడు భయరహితుడు, నిరాకారుడు; అతడు శూన్యం కాదు.. స్థూలం కాదు. అతనికి ఎటువంటి రూపురేఖలు లేవు. అతడు కనిపించేవాడు కాదు, కనిపించనివాడు కాదు. అతడు దాక్కునిలేడు, ప్రకటన రూపంలో కూడా లేడు. అతను ఏ రంగులో వుంటాడు, రంగు లేకుండా ఉంటాడో ఈ విషయంలో ఏమీ చెప్పలేం. ఈ సృష్టిలోని కణ కణంలోనూ ఈ పరమతత్త్వం వ్యాపించి ఉంది. అతను ఆది మధ్యాంతాలు లేనివాడు. అతని స్వరూపం గురించి ఎవ్వరూ చెప్పలేరు. ఆ వస్తువు అకథనీయం. అతడు ఎప్పటి నుంచో ఉంటున్నవాడు. జన్మను తీసుకోవడం లేదు. నష్టాన్ని పొందడం లేదు. ఏ తర్కం ద్వారా అతనిని

తెలుసుకోలేము. అతని గురించి ఏం చెప్పినా అలా అతను వుండడు. అతడు ఎలా ఉన్నాడో అలానే ఉంటాడు. అతని గురించి విన్నా, చెప్పుకున్నా జీవులకు ఆనందం లభిస్తుంది; పరమార్థం కూడా సిద్ధిస్తుంది."

* * *

35) " పరమతత్త్వం ఎవరి ద్వారానూ రచించినవాడు కాదు. అతను అవిగతుడు; నిరాధారుడు.. అతని ఆది అంతాలు ఎవ్వరికీ తెలియవు. అతను లోకం, వేదాల కంటే వేరుగా ఉన్నాడు. సమస్త సంసారాన్నీ విడిచి దానికి పైన ఉన్నాడు. అతనికి ఊరులేదు, స్థానం లేదు, నివసించే స్థలం లేదు. ఓ ఈశ్వరా! నీ గుణాలను ఎలా వర్ణించను! ఆ తత్వానికి రూపు రేఖలు లేవు; గుణ, వేషాలు లేవు. ఆ సాహెబ్ కులాల కంటే పైన ఉన్నాడు! అతడు బాలుడు, యువకుడు, వృద్ధుడు కాడు. అతను తనను తానుగా ఉంటాడు. కబీర్ విచారణ చేసి అంటున్నాడు! అతడు అఖండుడు; అతన్ని మనసారా సేవించే ఆత్మారాముడు సర్వాంగ సంపూర్ణుడు; ఆ రూపంలోనే అతనిని ధ్యానించు."

* * *

## మధ్యేమార్గం

1) " అధికంగా మాట్లాడరాదు.. మౌనంగా కూడా ఉండరాదు.. అధికంగా వర్షం కురవరాదు.. ఎండా ఎక్కువగా కాయకూడదు.. అతి ఎక్కువగా ఉండకుండా మధ్యస్థంగా ఉండాలి!"

* * *

2) " ఎవరైతే మధ్యేమార్గాన్ని అనుసరిస్తారో వారు వెంటనే భవసాగరాన్ని దాటేస్తారు. అలా కాకుండా ద్వంద్వాలలోనే ఉంటే సంసారంలోనే మునిగిపోతారు."

## జీవన్ముక్తి

1) " జీవించడం కన్నా మరణించడమే మేలు. ఎవరైతే మరణించడానికి ముందే మరణిస్తారో వారే అమరులు."

* * *

2) " ప్రపంచంలోని వారందరూ మరణిస్తున్నారు. అవసరం వున్న చోట మరణించటం లేదు. కబీర్ జీవన్ముక్తుడుగా మరణించాడు. అతడు మళ్ళీ మరణించనక్కరలేదు."

* * *

3) " మనస్సు మరణించగానే మమత మరణిస్తుంది. తరువాత అహంభావం నాశనం అవుతుంది. సాధకుడు ఎప్పుడైతే తనలో తాను లీనమవుతాడో ఆసనం భస్మంగా మిగులుతుంది."

* * *

4) "జీవన్ముకుడు కాకుండా జీవించడం కన్నా మరణించడం మేలు. మరణించడానికి ముందే ఎవరైతే మరణిస్తారో వారే ఈ కలియుగంలో అమరులు."

* * *

5) " ఆత్మానుభూతిని పొందిన తరువాత ఇప్పుడు నాకు అన్ని కార్యకలాపాల లోనూ కుశలమే కన్పిస్తోంది! గోవిందుడు ఎప్పుడైతే తెలియబడ్డాడో నా మనస్సుకు శాంతి లభించింది! శరీరంలో ఉన్న కోటి బాధలు సహజ సమాధి సుఖంలా మారిపోయాయి! యముడు 'రాముడు' అయ్యాడు. దుఃఖం సుఖంగా మారింది! శత్రువులు మిత్రులు అయ్యారు. దుర్జనులు సజ్జనులైనారు ! మూడు రకాల తాపాలు (దైహిక, దైవిక, భౌతిక) బాధించడం లేదు. 'మనస్సు మారి సనాతనమైనది ! ఆత్మను ఎప్పుడు తెలుసుకున్నానో అప్పుడే జీవన్ముక్తుడనయ్యాను. సహజ సుఖ స్థితిలో మునిగి ఉన్నాను! ఇప్పుడు నేను ఎవ్వరికీ భయపడను! ఎవ్వరినీ భయపెట్టను!"

## విగ్రహారాధన

"రాయిని పూజిస్తేనే భగవంతుడు లభించేటట్లైతే.. అన్నింటికన్నా పెద్దరాయి అయిన పర్వతాన్ని పూజిస్తాను! అంతకంటే తిరగలిని పూజిస్తే కనీసం రొట్టెలు చేసుకునే పిండైనా లభిస్తుంది."

## సారం

1) " ఏ విధంగానైతే ఒక చేట సారాన్ని గ్రహించి పొట్టును వదలివేస్తుందో, సాధువులు కూడా చెడును వదలి మంచి గుణాలను మాత్రమే స్వీకరిస్తారు."

* * *

2) "హంస ఏ విధంగానైతే పాలను నీరును వేరు చేసి పాలను మాత్రమే గ్రహిస్తుందో, అదే విధంగా ఆ జనులు సారాన్ని గ్రహిస్తే మంచిని పొందుతారు."

* * *

3) " ఆత్మతత్వం పాలు లాంటిది. మిగతా వ్యవహారం అంతా నీరు లాంటిది. సాధువులు హంస లాంటివారు. ఏవి పాలో ఏది నీరో వారు మాత్రమే తెలుసుకోగలరు."

* * *

4) “ చెడు గుణాలను గ్రహించకు. మంచి గుణాలను మాత్రమే ఎంచుకుని స్వీకరించు. తేనెను సేకరించే తేనెటీగ లాగా అందరిలో వున్న భగవంతుణ్ణి గుర్తించు” – అని కబీర్ అంటున్నాడు.

## పరీక్ష

1) “ ఒక వ్యక్తిని చూసినప్పుడు గమనించు, పరీక్షచేయి, ప్రశ్నించు ! లోపలి స్వభావాన్ని బట్టే మాటలు వస్తాయి; దానిని బట్టే నిర్ణయం తీసుకో.”

* * *

2) “ మానస సరోవరంలో హంస, కొంగ ఒకేలా చరిస్తూ ఉంటాయి! కొంగ చేపలను ఏరుకుంటే హంస ముత్యాలను తింటుంది.”

## ఆచరణ

1) “ఆచరించకుండా కేవలం చెప్పడం వలన ఏం లాభం? కాలం అనే కోట చూస్తుండగానే పడిపోతుంది. ఆచరణ లేని మనుష్యులు తొందరలోనే పతితులు అవుతారు.”

* * *

2) “ కేవలం మాటలు చెప్పడం మాని పనిచేయి. నీళ్ళు త్రాగకుండా మనిషి దాహం ఎలా తీరుతుంది?”

* * *

3) “ నువ్వు ఆచరణ చేసిన తరువాత ఇతరులకు బోధించు. బియ్యం లేని పొట్టును ఎంత దంచినా చేతికి ఏమీ అందదు.”

## ఆత్మతత్వం

1) “ గ్రంథాలను చదవటం వలన మాత్రమే పండితుడు కాడు; ఒక్క అక్షరం ‘ ప్రేమ’.. ఆ తత్వాన్ని తెలుసుకున్నా కూడా అతడే నిజమైన పండితుడు.”

* * *

2) “ ఆత్మ తత్వాన్ని తెలుసుకోకుండా జ్ఞానాన్ని గురించి కోటి కథలు తెలిసినా ప్రయోజనం లేదు. సూర్యుడు ఉదయించకుండా నక్షత్రాలు చీకటిని పారద్రోలలేవు.”

* * *

3) “ఎవరైతే కాశీలో ఇల్లు కట్టుకుని నివసిస్తూ ఉంటారో, స్వచ్ఛమైన

గంగా జలాన్ని త్రాగుతూ ఉంటారో వారు కూడా ఆత్మతత్త్వం తెలియకుండా ముక్తిని పొందలేరు."

* * *

4) " ఆత్మతత్త్వానికి ముఖం లేదు, తల లేదు. రూపం లేదు. రూప హీనం కూడా కాదు. అది పుష్పంలోని సుగంధం కంటే సూక్ష్మమైనది. ఆ అనుపమ తత్వం కేవలం అనుభూతికి మాత్రమే అందుతుంది."

* * *

5) " పరమతత్త్వం సృష్టి యొక్క ఆది, మధ్య, అంతము! ప్రతి దశలోనూ నాకంటే విడిగా లేదు; అది నిరంతరం నాతోనే ఉంది.

* * *

6) " కబీర్ అంటున్నారు : " మనస్సు యొక్క భ్రమ మనస్సు నుంచి ఎప్పుడు తొలగిపోతుందో.. సహజంగానే హరి క్రీడా విలాసం చేస్తాడు. ' నేను – నువ్వు,' అనే ద్వైత భావన వుండదు. అఖండ చైతన్యం అందరి శరీరాలలో ఉన్నట్లు తెలుస్తుంది. ఎప్పుడైతే ఈ మనస్సు ఆత్మతత్త్వాన్ని తెలుసుకుందో అప్పటి నుంచి రూపు, రేఖ, రంగు లాంటి భేదభావాలు ఏమీ ఉండవు. 'తనువు మనస్సు' – 'మనస్సు తనువు' ఒక్కటైపోతాయి! ఈ అనుభవంలో మనస్సు సంతుష్టం పొందుతుంది. ఆత్మలో లీనమైన అఖండ ఆత్మారాముడు ఈశ్వరుడిలో ఐక్యమయ్యాడు."

* * *

7) కబీర్ మనస్సును సంబోధిస్తూ అంటున్నాడు : " ఓ మనసా ! నువ్వు బుద్ధి మంతురాలివి! జ్ఞానం యొక్క భాండాగారానివి. నువ్వు నీలో నీ విచారణ చేసి ఈ విషయాల గురించి చెప్పు. ఎవరు తెలివైనవాడు? ఎవరు పిచ్చివాడు ? (ఈశ్వరుని పట్ల ప్రేమ ఉన్నవాడా? విషయ వాసనలను ప్రేమించేవాడా?) జీవుల దుఃఖానికి కారణం ఏమిటి? ఆ దుఃఖం ఎలా పోతుంది? ఏ వస్తువుకు సారం వుంది? ఏది నిస్సారమైనది? నీకు కీడు చేసేవారెవారు? నిన్ను ప్రేమించే వారెవరు? ఏది సత్యం? ఏది అబద్ధం ? ఈ ప్రపంచంలో ఏ వస్తువు చేదైనది? ఏది తియ్యనైనది? ఎవరు వాసనల తాపంలో కాలిపోతున్నారు? ఎవరు ఆనంద భోగాల్ని పొందుతున్నారు? ముక్తి అంటే ఏమిటి? మెడలో పడే మరణ (యమ) పాశం ఏమిటి? ఓ మనసా! బాగా ఆలోచించి చెప్పు! జీవితం యొక్క మూలతత్వాలను గురించి అడుగుతున్నాను! మనస్సులోని సంశయం నన్ను శూలంలా గుచ్చుకుంటోంది. అర్థం చేసుకుని ఈ విషయాలన్నీ చెప్పు !"

# నింద

1) " ఇతరుల దోషాలు చూసి నవ్వే ప్రజలు తమ చిత్తాన్ని ఒక్కసారి చూసుకుంటే అనంత దోషాలను గుర్తించగలరు."

* * *

2) " నిన్ను నిందించే వారిని దూరం చేయకుండా ఆదరించు! వారు నిందాపూరకమైన వాక్కులతో నీ శరీరాన్నీ, మనస్సునూ, వాక్కునీ శుద్ధం చేస్తారు."

* * *

3) " ఇతరులను నిందించేవాడు 68 తీర్థాలలో మునిగి స్నానం చేసినప్పటికీ మలినం పోదు. భూమి చుట్టూ 56 కోట్ల సార్లు ప్రదక్షిణం చేసినప్పటికీ ఇతరులను నిందించేవారు నరకానికే పోతారు."

* * *

4) " నీ కాళ్ళ క్రింద ఉందని గడ్డిని కూడా నిందించకు. చిన్న ముక్క నీకంట్లో పడితే ఎంతో కష్టతరంగా ఉంటుంది" అని – కబీర్ అంటున్నాడు.

* * *

5) కబీర్ అంటున్నాడు : " ఓ ప్రజలారా నన్ను నిందించండి! నన్ను నిందించండి! ఈ తనువు మనస్సు ప్రియతమ రామునితో సంయోగం చెంది ఉంది. నేను పిచ్చిదాన్ని. నా భర్త రాముడు. అందుచేత నేను సింగారించుకుంటున్నాను. ఏ విధంగానైతే చాకలి మలిన వస్త్రాల మురికిని శుభ్రం చేస్తాడో అలానే నిందించే ప్రజలు హరిభక్తుల మాలిన్యాలను దూరం చేస్తున్నారు. నిందించేవారు నా తల్లితండ్రిలాంటి వారు. నా జన్మజన్మల పాపాలను పోగొడ్తున్నారు. నిందించే వారు నా ప్రాణాధారము. కూలి తీసుకోకుండానే నా పాప భారాన్ని మోస్తున్నారు. నిందించే వారు త్యాగధనులు. వారు ప్రజలను, భవసాగరాన్ని దాటిస్తున్నారు."

# అరిషడ్వర్గాలు

## కామం

1) " దీపం యొక్క వెలుగును చూసి కీటకాలు అందులో పడి మరణిస్తున్నాయి. పెద్ద పెద్ద కోరికలు కష్టాల్ని కలుగజేసినప్పటికీ.. మనుష్యులు వాటిని వదలలేకపోతున్నారు."

* * *

2) " 'కామం', 'కామం' అని అందరూ అంటూంటారు; వారికెవ్వరికీ

కామం యొక్క రూపం తెలియదు. మనస్సులో ఏవైతే కల్పనలు వుంటాయో వాటినే 'కామం' అంటారు."

## క్రోధం

1) " ఒక్క క్రోధం వెంట కోటి కర్మలు ఉంటూ ఉంటాయి. మనస్సులో అహంకారం వుంటే చేసిన మరి చేయించిన కర్మలన్నీ విఫలమౌతాయి."

* * *

2) " చాలా ప్రయత్నాలు చేసి సంపాదించిన ధనాన్ని నష్టపోతావు. లోభి యొక్క ధనం చివరకు దొంగల పాలవుతుంది."

## మోహం

1) " మనకు ఎవ్వరూ లేరు. మనం ఎవ్వరికీ ఏమీ కాము. నావ ఒడ్డుకు చేరిన తరువాత కలిసున్న అందరూ విడిపోక తప్పదు."

* * *

2) " ఒక్క జింకపిల్లపై మోహంతో జడ భరతుడు మళ్ళీ జన్మించాల్సి వచ్చింది. మనుష్యులు ఎన్నో మోహాలతో ఉన్నారు! మరి వారు ఏ విధంగా రక్షింపబడతారు?

## మదం

1) " పేదవారిని చూసి గర్వంతో నవ్వొద్దు. నీ జీవిత నావ నడి సముద్రంలో ఉంది, భవిష్యత్తులో ఏమవుతుందో?!"

## గర్వం

1) "నీ గొప్పతనాన్ని గురించి నువ్వు పెద్ద పెద్ద మాటలు మాట్లాడకు. నా విలువ లక్షల్లో ఉంటుంది అని వజ్రం ఎప్పుడూ అనదు."

* * *

2) " ఖర్జూర చెట్టులా మనిషి ఎత్తుగా ఉండి లాభమేమి? బాటసారికి అది నీడ ఇవ్వలేదు, పళ్ళేమో చాలా దూరంలో ఉంటాయి."

* * *

3) " ఎత్తుమీద నీరు నిలువదు. పల్లంలోకే ప్రవహిస్తుంది! క్రింది ఉన్నవారు నిండుగా త్రాగొచ్చు; పైన ఉన్నవారు దప్పికతోనే ఉంటారు."

## ఆశ - తృష్ణ

1) "ఆశ - తృష్ణ సముద్రంలోని అలల లాంటివి. అందులో పడిన వారి మనస్సుకు శాంతి లేదు. ఎవరైతే జగత్తు యొక్క ఆశల్లో పడతారో వారు అలల దెబ్బలు తింటారు."

* * *

2) " మనస్సులోని ఆశలు చావకుండా కూర్చుని ధ్యానిస్తే ఏం లాభం? గానుగ ఎద్దులాగా మనస్సు ఇంటిలోని ఆ యాభై అడుగులు లోనే తిరుగుతుంది."

## దుఃఖం

" సుఖంగా ఉన్నవారిని వెతుకుతూ నేను తిరిగినప్పుడు సుఖంగా ఉన్నవాడు ఒక్కడూ నాకు దొరకలేదు. ఎవరి ముందైతే నా కష్టాలు చెప్పానో నా కంటే ముందు వారు ఏడుస్తూ తమ కష్టాలు చెప్పుకుంటున్నారు !"

## తృప్తి

" నీ దగ్గర వున్న ఎండిపోయిన రొట్టెను తిని చల్లని మంచినీళ్ళు త్రాగు. నెయ్యి రాసిన ఎదుటివాడి రొట్టెను చూసి ఆశపడకు."

## అహంకారం

1) "అహంకారం అనేక రకాలు ! మనుష్యులు తెలుసుకోలేకపోతున్నారు. శరీర అహంకారం.. మానసిక అహంకారం.. జాతి అహంకారం.. మాయా అహంకారం.. విద్యా అహంకారం.. గుణ అహంకారం.. రాజ అహంకారం.. ఈ అహంకారాలన్నీ దాటితే నీలోనే అనాహతనాదం వినగలవు. ఆత్మానుభూతిని పొందగలవు."

* * *

2) " నేను గొప్ప.. 'నేను గొప్ప..' అనే భావన మట్టితో సమానమైనది. ధాన్యం యొక్క పది మడులు, మూటలో పది రూపాయలు ఉన్న కారణంతో నేను గొప్పవాణ్ణి అనుకోవటం తుచ్ఛం. 'నేను బాబా' (..గ్రామపెద్ద..)యొక్క ముఖ్య అనుచరుణ్ణి అనుకుంటూ ఇష్టానుసారం ఆటలాడుతున్నావు. ఇలాంటి అహంకారాలతోనే అనేక సంసారాలు నష్టపోయాయి. అలాంటి అహంకారులందరూ

యమలోకం చేరారు: కబీర్ అంటున్నాడు: " ఇదంతా ఆ పరమాత్మ యొక్క లీల; అతడు క్షణంలో 'స్వామి' పదవి నుంచి 'ఫకీరు' పదవికి తీసుకువచ్చేస్తాడు."

* * *

3) " పండితులు వేదాలు చదివి వాటితో విచారణ చేస్తూ భ్రమిస్తున్నారు. వివిధ భేద భావాలతో ఆత్మభావాన్ని పొందలేకున్నారు. వారు సంధ్యా వందనం, తర్పణాలు, షట్కర్మలలోనే లీనమై ఉన్నారు. ఆశ్రమ వ్యవస్థలోనే జీవిస్తున్నారు. నాలుగు యుగాల నుంచి గాయత్రీ మంత్రాన్ని చదువుతున్నారు. వారిని అడుగు దీనితో ముక్తి లభిస్తుందా! సమస్త ప్రాణులలోనూ రాముడు వున్నాడు. అటువంటప్పుడు ఎవరిని నీచుడు అంటున్నావు? పండితులు తమ గుణాలవల్ల అధికంగా గర్వపడుతున్నారు. అధిక గర్వం ఉండటం వలన వారికి మంచి జరగదు. స్వామినన్న అహంకారం ఉంటే పరమాత్మను ఎలా పొందగలవు? కులాభిమానాన్ని వదిలి నిర్వాణాన్ని పొందే మార్గాన్ని వెదుకు. అహంకారం యొక్క బీజం, అంకురం ఎప్పుడైతే నాశనం అవుతాయో అప్పుడే విదేహ స్థితి లభిస్తుంది."

## వివేకం

1) "హృదయంలో ప్రేమ, వివేకం ఉదయించగానే నిర్భయత్వం వస్తుంది. ఉత్తమమైన ఆ జ్ఞానంతో సంసారంలో ఉండే మోహం అంతా నశిస్తుంది."

* * *

2) " సముద్రపు అలలకు ముత్యాలు వెదజల్లబడతాయి. కొంగకి వాటి విలువ తెలియదు. కానీ, హంస వాటిని ఏరుకుని, ఏరుకుని తింటుంది."

* * *

3) "సత్పురుషుల మాటలు సముద్రంలోని రత్నాల లాంటివి. మంద భాగ్యులు వారి దగ్గరకు వెళ్ళినప్పటికీ చేతులనిండా రాళ్ళే తెచ్చుకుంటారు."

* * *

4) " నాలుగు వేదాలు చదివినప్పటికీ పండితులకు ఆత్మతత్త్వం తెలియదు. ధాన్యాన్ని కబీర్ పట్టుకెళ్ళి పోయాడు. ఖాళీ పొలాల్లో పండితులు ఇంకా వెతుకుతూనే ఉన్నారు."

## విచారణ

1) " ఆచార్యులు అన్ని చోట్లా లభిస్తారు. కానీ, విచారణ చేసేవాడు లభించడు, కోటి ఆచార్యుల కన్నా విచారణ చేసేవాడే శ్రేష్ఠుడు."

* * *

2) “ అగ్నిలో కాళ్ళు పెట్టకుండా కేవలం ‘అగ్ని’ అన్నంత మాత్రాన ఎలా కాలుతుంది? ఆత్మతత్త్వాన్ని అనుభవంలో తెలుసుకోకుండా కేవలం ‘ఆత్మజ్ఞానం’ అనటంలో లాభం ఏముంది?”

* * *

3) “ నేను చాలా ఆలోచించి విచారణ చేసి ఆత్మకన్నా అన్య వస్తువు లేదని తెలుసుకున్నాను; పరమాత్మ నాలోనే కలసిపోయాడు.. అని ‘కబీరు’ అంటున్నాడు.

## ఓర్పు

“ ఓ మనసా! నెమ్మదిగా ఉండు. నెమ్మదిగానే అన్ని పనులూ జరుగుతాయి. తోటమాలి వందలకొద్దీ కడవల నీళ్ళు పోసినా ఋతువు వచ్చినప్పుడే ఫలాలు వస్తాయి.”

## క్షమ

1) “దుష్టుల వచనాలు బాణాల్లా ఉన్నప్పటికీ సాధుజనులు సహిస్తూనే ఉంటారు; ఒకానొక పిడుగు సముద్రంలో పడినప్పుడు ఎలా మండుతుంది?”

* * *

2) “బలవంతుడికి క్షమ, ధనవంతునికి గర్వం లేకపోవటం, విద్యావంతునికి వినయం.. అలంకారాలు మూడు రకాలుగా ఉన్నాయి ఈ లోకంలో.”

## శీలం

“ శీలవంతుడు అందరికంటే గొప్పవాడు. అన్ని రత్నాల ఖని. మూడు లోకాల సంపద ఒక్క ‘శీలం’ లోనే ఉంది.

## సంతోషం

“గోవులు, ఏనుగులు, గుఱ్ఱాలు, రత్నాలు..ఈ సంపదలన్నీ ‘సంతోషం’ అనే సంపద ముందు ధూళితో సమానం.”

## మనోనిశ్చలత

“ కోరికలు పోయి చింతలన్నీ అణిగిపోయినప్పుడు మనస్సు నిశ్చలం అవుతుంది. అటువంటి వానికి ఏమీ అక్కరలేదు. అతడే సార్వభౌముడు.”

# సత్యం

1) "ప్రజలు సత్యాన్ని నమ్మకుండా అసత్యం పట్ల విశ్వాసంగా ఉన్నారు. మధువు కూర్చుని అమ్ముతూండగా.. పాలు పెరుగు వీధి వీధి తిరిగి అమ్మాల్సి వస్తోంది."

* * *

2) "మృదంగం లాంటి వాయిద్యాన్ని మెడలో వేసుకుని దానిని మీటుతూ ప్రపంచమంతా తిరిగాను. అంతా పరీక్షించాను. భగవంతుడు ఒక్కడే అనే సత్యం గురించి తెలుసుకున్నాను కబీర్ అంటున్నాడు."

# దయ

" దయ అన్నదే ధర్మం యొక్క మూలం. సంతాపం కల్గించడమే పాపం. ఎక్కడైతే క్షమ ఉంటుందో అక్కడ ధర్మం వుంటుంది. ఎక్కడైతే దయ ఉంటుందో అక్కడ నీ ఉన్నతి ఉంటుంది."

# వినమ్రత

1) " వినమ్రతగా ఉండడం ఇతరుల కంటే నీకే ఉత్తమం. త్రాసులో తూచేటప్పుడు ఏవైపు ఒంగితే అదే శ్రేష్ఠం కదా."

* * *

2) " వృక్షాలు తమ పళ్ళను తాము తినవు. నదులు తమ నీటిన తాము త్రాగవు.పరమార్థం కోసమే సాధువులు శరీరాల్ని ధరిస్తారు."

* * *

3) " ఎవరైతే నీ మార్గంలో ముళ్ళు జల్లి నీకు అపకారం చేస్తారో, నువ్వు పూలు చల్లి ఉపకారమే చేయి! నీ మార్గంలోకి పూలకు పూలే వస్తాయి. వారికి ముళ్ళే లభిస్తాయి."

# ప్రార్థన

"దుఃఖం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ భగవంతుని స్మరిస్తారు ! సుఖంగా ఉన్నప్పుడు ఏమీ చేయరు ! ఎవరైతే సుఖంలో కూడా దేవుడిని ప్రార్థిస్తారో వారికి దుఃఖం ఎందుకు ఉంటుంది?"

# అశాశ్వతం

1) " నువ్వు ఎవ్వరికీ ఉపయోగపడని రోజంటూ ఒకటి వస్తుంది ! నీ గృహంలోని భార్యే కాకుండా, నీ శరీరంలోని నారి (నరం) కూడా నిన్ను వదిలి వెళ్ళిపోతుంది."

* * *

2) " శరీరం అనే నగరాన్ని నాశనం చేయటానికి శరీరంలోని అయిదుగురు దొంగలు, పది ద్వారాలు ఉన్నాయి! యమరాజు ఈ దుర్గాన్ని నాశనం చేయాలనుకుంటున్నాడు ! వీటి నుంచి కాపాడుకోవటం కోసం ధ్యానం చేయి."

* * *

3) " ఈ సుందరమైన శరీరాన్ని చూసి ఎందుకు గర్వపడుతున్నావ్? ఏ విధంగానైతే పాము కుబుసం విడిచిన తర్వాత దాని ఉపయోగం లేదో, అదే విధంగా ఈ శరీరాన్ని ఒకసారి వదిలిపెట్టి పోయిన తర్వాత ఏ ఉపయోగం లేదు."

* * *

4) " తల్లి పరాయిది (బాటసారి); తండ్రి పరాయివాడు. వీరి మధ్య మనం కూడా (బాటసారులమే) పరాయివాళ్ళమే ! ఏ విధంగానైతే నదిలో నావలు నానా స్థలాల నుంచి వచ్చి ఒక చోట కలుస్తాయో అలాగే మనందరము కలిశాం."

* * *

5) " 'నేను' 'నాది' అని అనకు; 'నాది' అనే భావన నిన్ను పూర్తిగా నాశనం చేస్తుంది. 'నాది' అనే భావన కాళ్ళకు సంకెళ్ళు లాంటిది. కంఠానికి ఉరిలాంటిది."

* * *

6) " 'ఏ ధనమైతే నీ జన్మజన్మాంతరాలకు వస్తుందో... అటువంటి ధనాన్ని సంపాదించు. ఎంతో కష్టపడి సంపాదించిన భౌతిక ధనాన్ని ఎవ్వరూ నెత్తిమీ ద పెట్టుకుని మరణించేటప్పుడు పట్టుకెళ్ళటం నేను చూడలేదు'' అని కబీర్ అంటున్నాడు."

* * *

7) " ఓ మనసా! ఈ శరీరం కాగితపు బొమ్మ. కొన్ని నీటి బిందువులు పడితే క్షణంలో పాడైపోయే దీన్ని చూసుకుని ఎందుకు గర్వపడుతున్నావ్? మట్టిని తవ్వి గోడలు కట్టుకుని అజ్ఞానులు ఇది నా ఇల్లు అంటున్నారు. యమదూతలు బంధించి తీసుకెళ్లిపోయాక ఎవ్వరూ వెనక్కి తిరిగి రావటంలేదు. మోసం చేసి ధనాన్ని సంపాదించి జనులు గోతిని తవ్వి దాస్తున్నారు. ఈ శరీరం నుంచి శ్వాస

పోయిన వెంటనే దాచిన ధనం అంతా పోగొట్టబడుతోంది. నాటకం మధ్యలోనే నటుడు అలసిపోతే మృదంగం వాయించడం ఎందుకు? రెక్కలు ఊడిపోయి పోరాటానికి ఎందుకు వస్తావు?

* * *

8) " ప్రపంచంలో చూస్తుండగానే అన్నీ నాశనమైపోతున్నాయి. స్థిరంగా ఉండేవేమీ కనిపించటం లేదు. భగవంతుడిని ఏం అడుగను? లక్షమంది పుత్రులు లక్షకు పైన వారసులు గల రావణుని ఇంటిలో దీపం పెట్టడానికి ఒక్కడు కూడా మిగిలిలేడు. లంక లాంటి కోట, సముద్రం లాంటి కందకాలు ఉన్నప్పటికీ రావణుకి కొంచెం కూడా ఏమీ మిగలలేదు. వచ్చేటప్పుడు ఒక్కరమే వచ్చాము... వెళ్లేటప్పుడు ఒంటరిగానే వెళతాము. ఏ విధంగానైతే జూదరి జూదంలో అన్నీ పోగొట్టుకుని ఖాళీ చేతులతో వెళతాడో అలాగే మరణించేటప్పుడు ప్రతి ఒక్కరు ఖాళీ చేతులతోనే వెళ్ళాలి."

* * *

9) " ఈ ప్రపంచంలో ప్రజలు నాది నాది అంటూ మోహ మాత్సర్యాలను పెంచుకుంటున్నారు. వీటికంటే ముందు గొప్ప సాధువులం సత్‌పురుషులం అనుకునే గొప్పవారు కూడా నాది అంటూనే కాలగర్భంలో కలిసిపోయారు. ఎవరు మామ, ఎవరు చిన్నాన్న, ఎవరు కొడుకు అంతా భ్రమ. ప్రపంచమంతా బజారులాంటిది దాని అసలు తత్వాన్ని సాధు పురుషులు మాత్రమే గుర్తించగలరు. నేను ఇక్కడకు వేరే దేశం నుంచి వచ్చాను. ఇది నా ఇల్లు కాదు. ఇక్కడ నాకు ఏ ఆత్మీయులు లేరు. ఈ ప్రపంచంలో నాకు ఒక్క నీమీదే భరోసా ఉంది. ఎవరైతే తమ కర్తవ్యాన్ని (తనను తాను తెలుసుకుంటారో) పాలిస్తూ ఉంటారో వారు స్వర్గానికి వెళతారు. ఎవరైతే పంచతత్వాల యొక్క మర్మం తెలుసుకోలేరో వారు నరకానికి వెళతారు. ఈ కుటుంబమే నా ఇల్లు అనుకుంటూ, కుటుంబం కోసం పాపపు సంపాదన చేస్తున్నావో ఇవన్నీ స్వార్థంతో అల్లుకున్న బంధాలు.. ఇవేమీ నీవి కావు. ఎవరికీ చెడు చేయకుండా ఈ భవసాగరాన్ని దాటే మార్గాన్ని పట్టుకో. భగవంతునికి జవాబు చెప్పాల్సి ఉంటుంది."

* * *

10) " మానవ జన్మ అనే గొప్ప అవకాశం మళ్ళీ రాదు. రాముడు (ఆత్మ) లభిస్తే సంపూర్ణతత్త్వం ప్రాప్తించినట్లే ! అనేక జన్మలు వెళ్ళిపోయాయి. అనేకం వచ్చాయి. అన్నీ వ్యర్థమైపోయాయి. ఈ నటుడు అనేక రూపాలలో అనేక వేషాలు వేస్తూ వస్తున్నాడు." కబీర్ ప్రార్థిస్తున్నాడు: " ఓ భగవంతుడా! అనంత దుఃఖాలను పోగొట్టుకునే మార్గాన్ని తెలియచేయి."

* * *

11) "ఓ జీవుడా! ఏం చూసుకుని అంత ఆనందంగా తిరుగుచున్నావు? పది నెలలు తల్లి కడుపులో వున్న రోజులను మరచిపోయావా? మరణించిన తర్వాత ఈ శరీరాన్ని భస్మం చేసేస్తారు. అలా చేయకపోతే శరీరం నుంచి క్రిములు వచ్చేస్తాయి. ఓటి కుండలో పోసిన నీరు లాంటిది శరీరం. అందుకోసము ఎందుకు గర్వపడుతున్నావు? ఏ విధంగానైతే తేనెటీగ తేనెను ప్రోగుచేస్తూ ఉంటుందో అలానే ప్రజలు డబ్బును కూడ బెడుతున్నారు. నువ్వు మరణించగానే డబ్బును పంచుకోవడం కోసం ప్రజలు ఆత్రుత పడతారు. శరీరాన్ని ఎక్కువసేపు ఉంచితే ప్రేతము అవుతుందనే భయంతో వెంటనే బయటకు పంపేస్తారు. ఇంటిలోని స్త్రీ ఇంటివరకు.. మిగిలిన వారు శ్మశానం వరకు వస్తారు. అక్కడ నుంచి జీవాత్మ ఒంటరిగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రామనామాన్ని ఎందుకు మరచిపోయావు? చీకటి నూతిలో ఎందుకు పడుతున్నావు. నీకు నువ్వే సంసారంలో బంధింపబడ్డావు. ఎలా అయితే రామచిలుక లోహపు కడ్డీని పట్టుకుని వ్రేళ్ళాడుతూ ఆ కడ్డీ తనను పట్టుకుందని భ్రమించి ఆ లోహపు కడ్డీని పట్టుకుంటుంది. నువ్వు కూడా భ్రమలో ఉన్నావు. నిన్ను ఎవ్వరూ బంధించలేదు."

* * *

12) " ఈ ప్రపంచం నుంచి ఎవరు వెళ్ళిపోయారు? ఎవరు వెళ్ళకుండా ఉండిపోయారు? శరీరం అనే ఈ కోట పడిపోయి మట్టిలో కలిసిపోవలసిందే! ఇంద్రుడు లాంటి అనేకమంది వ్యక్తులు వెళ్ళిపోయారు. పంచపాండవుల లాంటి జోడీలు ఎందరో వెళ్ళిపోయారు. ధ్రువ నక్షత్రం లాంటి నక్షత్రాలు కూడా శాశ్వతంగా ఉండవు. సూర్యచంద్రులు కూడా నశించిపోయే కాలం వస్తుంది.'' కబీరు అంటున్నాడు: " ఓ మూఢుడా మేల్కో, మేల్కొని ఈ జగత్తుని చూడు. శరీరం పండిపోకముందే నిరాకారుడైన పరమేశ్వరుని తెలుసుకో !"

* * *

13) " ఓ పండితుడా! వాద వివాదాలు చేయకు ఈ శరీరం లేకుండా శబ్దము లేదు, రుచి లేదు. అండపిండ బ్రహ్మాండాలు అన్నీ మట్టే. నవ రంధ్రాలతో కూడుకున్న ఈ శరీరం కూడా మట్టే. అన్వేషణలో సద్గురువు లభించాడు, అనంత సత్యము పరిచయం చేయించాడు. జ్ఞానపరమైన విచారణతో జీవితం మట్టే.. మరణము మట్టే అని తెలిసింది. మరణించిన తరువాత మట్టిలోనే నివాసం వుంటావు. ఈ శరీరం మట్టియొక్క చిత్రము వాయువుతో (ప్రాణము) నడపబడుతోంది. బిందువు యొక్క సంయోగము వలన ఇది ఉత్పన్నమైనది. గోవిందుని యొక్క మాయచే ఇది నిర్మించబడింది.. నడపబడుతోంది.. నాశనం చేయబడుతోంది. ఈ మట్టి యొక్క మందిరంలో జ్ఞానం అనే దీపం శ్వాస అనే వత్తి ద్వారా ప్రకాశిస్తోంది. ఆ ప్రకాశంలోనే

ప్రపంచం అంతా జ్ఞానాన్ని తెలుసుకుంటోంది."

* * *

14) " ఓ సాధకుడా ! ఇంత అహంకారంతో ఎందుకు ఉంటున్నావ్? నవ ద్వారాలు గల ఈ దేహం మలినంతో కూడి ఉంది. నువ్వు దుర్గంధం యొక్క చెత్తకుప్పగా ఉన్నావు. ఈ శరీరాన్ని అగ్ని సంస్కారం చేస్తే భస్మమైపోతుంది. మిగిలిన శేషాన్ని కూడా నీటిలోని క్రిములు తినేస్తాయి. ఈ శరీరం పందులు, కాకులు కుక్కలకు భోజనం అవుతోంది. ఎందుకు దీని పట్ల ఇంత ఆసక్తి చూపుతున్నావ్! ఒకవేళ నీ కళ్ళు దానిని అనుభూతిని పొందలేవు. జ్ఞానసంబంధమైన విషయాలు కూడా రుచించవు. నువ్వు మాయ, మోహం, మమతకు వశీభూతుడవై ఈ సంసార సాగరంలో నీరు లేకుండానే మునిగిపోతావు. నువ్వు ఇసుక ఇంటిలో ఉన్నావు. అజ్ఞానం కారణంగా ఈ శరీరం క్షణభంగురం అని గ్రహించలేకపోతున్నావు. రామభక్తిలేని కారణంగా అనేకమంది తెలివైన వారు కూడా ఈ సంసార సాగరంలో మునిగిపోయారు."

* * *

15) ఓ మనసా ! నాలుగు రోజుల ఆతిధ్యం కోసం ఇక్కడ ఉన్నావు. కొన్ని రోజులు అతిధిగా ఉండటానికి వచ్చావు. మంచి పనులతో చేతులను ఎందుకు శోభితం చేసుకోవు. ఇతరుల వస్తువుల పట్ల ఆసక్తి ఎందుకు. అవి నీవి కావు నా మాట విను. ఈ ప్రపంచం పొగ యొక్క మేఘం లాంటిది. తనువు ధనం మరి జీవితం దోసిలలోని నీటిలా క్షణ భంగురమైనవి. ఎక్కువసేపు ఉండవు. ఈ సంసార వైభవం బూరుగు చెట్టు పూలలా ఆకర్షణీయంగా ఉంటుంది. కానీ, ఫలాలు అందవు. ఇక గర్వం ఎందుకు? నువ్వు పనికిరాని వస్తువులను సంగ్రహిస్తున్నావు. కానీ శుద్ధమైన వస్తువులను సహించడం లేదు. వస్తువులను సరిగ్గా వినిమయం చేయటం లేదు." కబీరు అంటున్నాడు, " ఏ వ్యాపారం చేస్తే పుణ్యలాభాలు వస్తాయో అలాంటి వ్యాపారం చేయటం లేదు. అలాంటి వ్యాపారం చేయి."

* * *

16) ప్రాణి సందడిగా ఉన్న సంగీత సభలో తన వాయిద్యాన్ని వాయించి వెళ్ళిపోతోంది. .. (తన ప్రాపంచిక భూమికను నిర్వహించి సెలవు తీసుకుంటోంది).. ఒక పిడికెడు మట్టి.. కూడా నీ వెంట రాదు; ఇంటి గడప వరకు, మాత్రమే భార్య వస్తుంది; గుమ్మం వరకు తల్లి వస్తుంది; స్మశానం వరకు కుటుంబంలోని వారు వస్తారు. తరువాత హంస రూపంలో ఉన్న జీవాత్మ ఒంటరిగానే వెళ్ళాలి ! నీ బంధుమిత్రులు ఊరూ, వాడా ఎవర్నీ నువ్వు కలవలేవు." కబీరు అంటున్నాడు: "జగన్నాధుని భజించు లేకపోతే జన్మ వ్యర్థమైపోతుంది."

* * *

17) " ఓ నరుడా! ఈ చిన్న విషయం పట్ల ఎందుకు గర్వపడుతున్నావు? నీ దగ్గర పది మణుగుల ధాన్యం, మూటలో పదిరూపాయలు ఉన్నాయి. ఈ ఐశ్వర్యాన్ని చూసి చూసి నువ్వు అహంకరిస్తున్నావా? వచ్చేటప్పుడు ఏం పట్టుకొచ్చావు? పోయేటప్పుడు ఏం తీసుకుపోతావు? నాలుగు రోజుల రాజరికం... ఏ విధంగానైతే అడవిలోని పచ్చని ఆకులు నాలుగు రోజులలోనే ఎండిపోయి రాలిపోతాయో, నువ్వు రాజువైనా, నీకు వంద గ్రామాలు ప్రాప్తించినా, పది లక్షలు లభించినా మరి పదిమంది నీ చుట్టూ తిరుగుతున్నా వీటన్నిటి వలన ఏం జరుగుతుంది? రావణుడు లంకా నగరానికే ఛత్రపతి. కానీ క్షణంలోఅతని సమస్త వైభవం నాశనమైపోయింది. మాత, పిత, కుటుంబీకులు, పుత్రులు స్త్రీ అంత్యకాలంలో కూడా రాలేరు." కబీర్ అంటున్నాడు: " ఓ పిచ్చివాడా ! రాముణ్ణి భజించు లేకపోతే జన్మ వ్యర్థమైపోతుంది."

* * *

18) " ఓ పిచ్చివాడా ! రామ నామ జపాన్ని చేయి. ఎందుకంటే ఈ దేహం ఎప్పుడూ ఉండదు. ఈ మాయ (సంసార వైభవం) ఈ మాయ ఎప్పుడు, ఎవ్వరితో స్నేహం చేస్తుంది. ఏదో ఒకరోజు ఈ దేహం గిరాటు వేయబడుతుంది. తక్షణం అర్థం చేసుకో. ఈ అశాశ్వతాన్ని గుర్తించి మేలుకో బంగారంతో నిర్మింపబడిన లంకా నగరం కాలిపోయి మట్టిలో కలసిపోయింది. ఆ రావణుని యొక్క గొప్పతనం అంతా క్షణకాలంలో నాశనమైపోయింది. 12 యోజనాల ఏ క్షేత్రం (రాజ్యం) దుర్యోధనుని అధీనంలో ఉండేదో.. అదంతా మట్టిలో కలసిపోయింది కదా. ఇక్కడ కబీరు అరచి చెప్తున్నాడు, " ఇక్కడ ఉన్నదేదీ నీది కాదు. రాత్రి నిద్రలోని స్వప్నంలా ఈ జీవుడు వచ్చి వెళ్ళిపోతాడు."

* * *

19) " ఓ సాధూ! ఇది శవాల గ్రామం; శరీరాన్ని ధరించిన వారెవ్వరూ ఇక్కడ శాశ్వతంగా ఉండటం లేదు. కనుక ఎవరి పేరునూ ఇవ్వను! పీరు (ముస్లిం మతగురువు), పైగంబరు (ప్రవక్త) చనిపోతున్నారు. యోగి కూడా మరణిస్తున్నాడు. రాజు, ప్రజలు, వైద్యుడు, రోగి అందరూ మరణిస్తున్నారు. చంద్రుడు, సూర్యుడు, ఆకాశం, భూమి నశిస్తున్నాయి. 14 లోకాల నాయకుడు కూడా మరణిస్తున్నాడు. ముప్పై మూడు కోట్ల దేవతలు మరణిస్తున్నారు. వీరంతా కాలం అనే పాశంలో బంధింపబడివున్నారు. ఒక్కటే జ్యోతి అన్ని దేహాల్లోనూ వ్యాపించి ఉంది. రెండవ తత్త్వం లేదు." కబీర్ అంటున్నాడు: " ఓ సాధూ ! ఆ తత్త్వం కోసం వెదుకు ! ఊరికే తిరుగుతూ తత్వం తెలుసుకోకుండా చావకు."

# జ్ఞానం

1) " సాధువు యొక్క జాతిని కాకుండా జ్ఞానం గురించి అడుగు... కత్తి పై తొడుగును కాకుండా లోపల ఉండే పదును చూడు."

* * *

2) " నేను అన్న అహంకారం ఉన్నంతవరకూ ఈశ్వరుడు లేడు! ఇప్పుడు అంతా ఈశ్వరుడే ఉన్నాడు ! 'నేను' లేను. హృదయంలో జ్ఞాన దీపం ఎప్పుడు వెలిగిందో, వెంటనే అంధకారం పోయింది."

* * *

3) " ఆత్మజ్ఞానం యొక్క ఉదయంతో సంసారిక వ్యవహారం అణిగిపోయింది! యాచకుడు (సాధకుడు) ఆనంద రూప ధనాన్ని ఇచ్చి దానిని పొందాడు. ఆ ధనాన్ని ఎవ్వరూ వదిలిపెట్టలేరు! ఎవరైతే ఒక్కసారి ఈ ధనాన్ని పొందారో ఇక ఎప్పుడూ యాచించాల్సిన అవసరం రాదు! ఈ జ్ఞానధనం ప్రాప్తించిన తరువాత అన్య సాధనాలను అనుసరించాల్సిన అవసరం రాదు! ఈ ధనం లేకుండా ఇప్పుడు జీవించటం కష్టం ! ఈ ధనం లభించిన తరువాత సంసారిక ఆకర్షణలు నశించిపోతాయి. అలాంటి జీవితమే నిజమైన జీవితం! జ్ఞానధనం లేని జీవితం జీవితమే కాదు! కళ్ళు లేకుండగానే (జ్ఞాన దృష్టితో) ఆ పరమతత్వం యొక్క దర్శనం లభిస్తుంది. తండ్రియైన భగవంతుడు, పుత్రుడైన సాధకుడు ఇప్పుడు ఒక్కటయ్యారు! సంసారంలో ఉంటూనే వాటిపట్ల నిర్లిప్తత సాధ్యమైంది! ఎవరైనా జీవించి ఉండగానే మరణిస్తే వారికి పంచేంద్రియాల ద్వారా ఆనందానుభవం లభిస్తుంది !" కబీర్ అంటున్నాడు; "నేను పరమాత్మను పొందాను; ఆ పరమాత్మలో నన్ను కలుపుకుని నా అస్తిత్వాన్ని పోగొట్టుకున్నాను."

# సజ్జన సాంగత్యం

1) "తీర్థస్థలాల్లో స్నానమాచరించటం వలన ఒక ఫలం లభిస్తే... సజ్జన సాంగత్యం వలన నాలుగింతలు ఫలం లభిస్తుంది. మరి... సత్‌గురు లభిస్తే అనేక రెట్లు ఫలం అంటుంది " కబీర్ విచార ధార!

* * *

2) "ఏ సుఖం కోసం మునులు ఆరాటపడతారో.. దేవతలు, మానవులు విలపిస్తారో.. ఆ సుఖం సంత్‌ల సాంగత్యంలో సహజంగానే లభిస్తుంది.

* * *

3) ఒక్క క్షణం కానీ, అర క్షణం కానీ, పావు క్షణం కానీ సజ్జన సాంగత్యం చేయటం వలన కోటి కోటి అపరాధాలు తొలగిపోతాయి.

* * *

4) " ఓంకారం ద్వారా ఈ జగత్తు సృష్టించబడింది. వికారం ద్వారా జగత్తు లయమైపోతుంది. వేణువు ద్వారా అనాహత నాదాల్ని వాయిస్తూ ఆకాశ మండలం (బ్రహ్మాండం) లో నివాసం ఏర్పరుచుకో ! జీవితం యొక్క ఏ ఆశ కూడా ఈ మిధ్యా ప్రపంచంలో పూర్తి కాదు. రామ రసాయనాన్ని (ఆత్మజ్ఞానాన్ని) ఎవరైతే త్రాగుతారో వారికి మళ్ళీ దాహం వేయదు. భగవద్భక్తితో కూడిన జీవితం అర క్షణం ఉన్నా చాలు. ఈశ్వర ప్రేమ లేకపోతే కోటి కల్పాల జీవితమూ వ్యర్థమే ! సంపదను చూసుకుని ఆనందించకు. విపత్తును చూసి ఏడవకు. కర్తగా నువ్వు ఏంచేస్తే అవే పొందుతున్నావు. స్వర్గాన్ని కోరుకోకు, నరకానికి భయపడకు. ఏం జరగాలో అదే జరుగుతుంది. వ్యర్థమైన ఆశలు పెట్టుకోకు. భగవంతున్ని పొందే ముక్తి నీకు లేకపోతే జపతపాలు, తీర్థయాత్రలు, స్నానాలు వ్యర్థమే. శూన్యమండలంలో ఉన్న పరమజ్యోతి ప్రకాశాన్ని వెతుకు. ఆ పరమ సత్యానికి రూపురేఖలు లేవు. అక్కడ పూలు విరబూస్తున్నాయి! సజ్జన సాంగత్యం ద్వారా హరిగుణాలను (ఆత్మజ్ఞానాన్ని) పొందు. అటువంటి వారి సేవ చేస్తే భగవంతుడు ఆనందిస్తాడు."

## హెచ్చరిక

1) " విషయ వాసనలలోపడి జన్మను వ్యర్థం చేసుకున్నావు. ఇప్పుడు పూర్వ కర్మలను గుర్తు చేసుకుని పశ్చాత్తాపపడితే ఏమి ఉపయోగం?" ఇప్పుడు ఏం చేయాలో దాని గురించి ఆలోచించు !

* * *

2) " ఈ శరీరంలో అతిధిలా ఉండటానికి వచ్చిన బాటసారివి... ఎప్పుడు వెళ్ళిపోతావో ఎవరికి తెలుసు? ఏ భరోసా కూడా లేదు."

* * *

3) " ఈ చిన్ని జీవితం కోసం ఏం చేస్తున్నావ్? ఏం ప్రోగు చేస్తున్నావ్? ప్రజలందరూ శరీరం, ఇల్లు, సంపద, రాజ్యం విడిచిపెట్టి వెళ్ళిపోతూనే ఉన్నారు."

* * *

4) " సమయం గడిచిపోతోంది. శక్తి తగ్గిపోతోంది; జుట్టు తెల్లబడుతోంది; చేయాల్సిన పని చేయి. ముక్తి కలిగించే సాధన చేయి."

* * *

5) “బాల్యం అంతా అమాయకత్వంలోనూ, యవ్వనం మత్తులోనూ వృద్ధాప్యం సోమరితనంతోనూ గడిచిపోతుంది. చివరకు చితి మీదకు వెళ్ళిపోతావు.”

* * *

6) “ జీవితాంతం చెడ్డపనులు చేసి చనిపోయే సమయంలో దానాలు ఇవ్వడం వలన ఏం లాభం?”

* * *

7) “ ఓ జీవుడా ! 'నాది', 'నాది' అంటూనే జీవితం అంతా గడిపేస్తున్నావు. హరి స్మరణం (ఆత్మజ్ఞానం) చేయకుండగానే జన్మ అయిపోతుంది. 12 సంవత్సరాలు బాల్యంలోనే పోగొట్టుకున్నావ్ ! తరువాత 20 సంవత్సరాలు (కిశోరావస్థ) కొంచెం కూడా ధ్యానం చేయలేదు ! ఆ తరువాత 30 సంవత్సరాల వరకు ఆత్మ రాముణ్ణి స్మరించలేదు ! ఇప్పుడు వృద్ధావస్థలో పశ్చాత్తాపపడి ఏం లాభం? ఇది ఎలా ఉందంటే ఎండిన చెరువుకి ఆనకట్ట కట్టినట్లు... కోసేసిన చేనుకు కంచె వేసినట్లు ఉంది. దొంగ గుర్రాన్ని దొంగిలించుకుపోయిన తరువాత యజమాని తాడు పట్టుకుని తిరుగుతున్నట్లు ఉంటుంది! వృద్ధాప్యంలో తల, చేతులు, కాళ్ళు వణుకుతూ ఉంటాయి. కళ్ళల్లో నీరు వస్తూ ఉంటుంది. నోటి నుంచి సరిగ్గా మాటలు పలుకలేవు ! అప్పుడు పుణ్యకర్మల గురించి మాట్లాడతావు.” కబీర్ అంటున్నాడు. “నువ్వు సంపాదించిన ధనం కొంచెం కూడా నీతో రాదు; ఈశ్వరుని నుంచి పిలుపు రాగానే ఇంటిని, ద్వారాలను, భవనాలను వదలి వెళ్ళాల్సిందే.”

## సాధన

1) “ నీళ్ళకు భయపడి గట్టుమీద కూర్చుంటే ఏం లభిస్తుంది? సాహసం చేసి లోతుల్లోకి వెళితేనే లభించేది లభిస్తుంది.”

* * *

2) “ మోహ నిద్రలో పడి ఏంచేస్తున్నావ్? ఇప్పటికైనా ఎందుకు మేలుకోవు? దేని నుంచైతే నువ్వు విడిపోయావో దాన్ని (ఆత్మ) పొందే ప్రయత్నం చేయి.”

* * *

3) “ కొంచెం సాధన చేసినా కోటి కర్మలు పోతాయి! అనేక యుగాల్లో ఎన్ని పుణ్యకర్మలు చేసినా కూడా ఆత్మారాముని వల్లనే ముక్తి లభిస్తుంది.”

* * *

4) “ సాధనలో కుండలినీ జాగృతమై సహస్రార చక్రంలో ప్రవేశించినప్పుడు అక్కడ సాగరమూ లేదు... ముత్యపు చిప్పలూ లేవు... స్వాతి బిందువులూ లేవు..

అయినప్పటికీ ముత్యాలు లభిస్తాయి." కబీరు ముత్యాలు ఏరుతున్నాడు.

* * *

5) " కబీర్ యోగ మార్గాన్ని పరిచయం చేస్తూ ఇలా అంటున్నాడు. గురువు చూపించిన మార్గంలో నాకు ఈ శరీరంలోనే విచిత్ర మార్గం దొరికింది. ఆ మార్గంలోనే నేను లక్ష్యాన్ని పొందాను."

* * *

6) " సాధనతో కుండలినీ రూపంలో ఉన్న పక్షి జాగృతమై ఆకాశాన్ని ("సహస్రార స్థితి") చేరింది ! అక్కడి శూన్య సరోవరంలో ఇంద్రియాతీతమైన అమృత రసాన్ని త్రాగుతోంది ! శరీర స్పృహ అనేది పూర్తిగా వదలి వేసింది."

* * *

7) " సముద్రంలోని ముత్యపు చిప్ప 'దాహం', అంటూ తిరుగుతోంది. స్వాతి బిందువులు మీద ఆశతో సముద్రాన్ని లక్ష్యపెట్టడం లేదు... సాధకుడు సంసార సాగరంలో ఉంటూ వివిధ ఆకర్షణలను తుచ్ఛంగా భావిస్తాడు; ఆత్మతత్వం కోసం సంసారాన్ని లక్ష్యపెట్టడు."

* * *

8) ఒక ఆశ్చర్యకరమైన విషయం జరిగింది. కార్యం కారణాన్ని నశింప చేసింది. సాధన ద్వారా ఈ జన్మ కారణం (మూల కారణము) నష్టమైపోయింది. కుండలినీ శక్తి సహస్రార కమలంలో ప్రవేశించగానే అందులో ఉన్న పరమతత్వం ప్రకాశిస్తుంది. పాప పుణ్యాల భ్రమ నాశనమైపోతుంది. నీలో ఉన్న వాసనలు, మలినాలు శుభ్రమైపోతాయి. సాంసారిక కుటుంబ సంబంధాలు సమాప్తమైపోతాయి. ప్రపంచంలోని చింతలన్నీ అణిగిపోతాయి. భ్రమలన్నీ పారిపోతాయి. కుండలినీ రూపంలో వున్న గంగ.. మూలా ధారం నుంచి లేచి మేరు పర్వతం (సహస్రార చక్రం) వైపు వెళుతుంది."

* * *

9) " ప్రతిరోజూ హరి యొక్క గుణాన్ని గానం చేయి. గురువు అనుగ్రహంతో శరీరంలో ఉన్న గూఢాన్ని తెలుసుకోగలవు. (ఆత్మారాముణ్ణి పొందగలవు). ఆదివారం నాడు భక్తిని ప్రారంభించు. శరీరం అనే మందిరంలో మానసిక సంకల్పాన్ని చేయి. ఆ సంకల్పం అహర్నిశలు అఖండగా వెలుగొందాలి. అనాహత నాదాలు శరీరం లోపల నుంచి సహజంగానే మ్రోగాలి. సోమవారం (సహస్రారం నుంచి) చంద్రుడు అమృతం కురిపిస్తాడు. దాన్ని త్రాగగానే యోగి తాపం నుంచి ముక్తి పొందుతాడు. నాలుక మడతబడి అమృత ద్వారం దగ్గర ఆగగానే ఆ రసంలో నియగ్నమైన మనస్సు... ఆ అమృతాన్ని తాగుతూ ఉంటుంది. మంగళవారం మనస్సును ధ్యానంలో

లీనంచేయి. పంచ వికారాల స్వభావాలను విడిచిపెట్టు. ఇల్లు విడిచిపెట్టి బయటకు వెళ్ళకు. బుధవారం బుద్ధి వికసిస్తుంది. హృదయ కమలంలో హరి నివసిస్తాడు. గురుకృపతో ఇడా పింగళ రెండు నాడులను కలుపు సహస్రార కమలం వైపుకు పైకి శీఘ్రంగా వెళ్ళు. గురువారంనాడు విషయాలన్నింటిని దూరంగా విడిచిపెట్టు. ముగ్గురు దేవతలను (మూడు గుణాలను) ఒక్కటిగా చేయి. త్రికుటిలో మూడు నదులు వున్నాయి (ఇడా,పింగళ,సుషుమ్న) పగలు రాత్రి అక్కడే స్నానం చేసి మలినాలన్నింటినే ప్రక్షాళన చేసుకో. శుక్రవారం నాడు అమృతాన్ని తీసుకుని ' నేను పగలు రాత్రి నాలోపల వున్న దుష్ప్రవృత్తులతో యుద్ధం చేస్తాను ' అని ప్రతిజ్ఞ చేయి. పంచేంద్రియాలను నియంత్రణ చేయి. అప్పుడు ద్వైత భావం తల ఎత్తదు. శనివారం నీ హృదయాన్ని స్థిరం చేయి. జ్యోతిని వెలిగించు. దీని వలన లోపల బయట అంతా ప్రకాశవంతం అవుతుంది. సమస్త కర్మఫలాలు నాశనం అవుతాయి. ఎంతవరకైతే నీ లోపల ద్వైత భావన ఉంటుందో అప్పటివరకు నీ శరీరం లోపలే ఉండే రాముని రహస్యాన్ని నువ్వు తెలుసుకోలేవు. ఎపుడైతే ఆనందాన్నిచ్చే రాముని పట్ల ప్రేమ పుడుతుందో అపుడే అవయవాలన్నీ నిర్మలమవుతాయి."

* * *

10) " నేను అన్ని కర్మలకు ఆయుధం అవుతాను. సహజ సమాధిలో ఉంటాను. యమరాజుకు భయపడను. కుమ్మరిలా దేహం అనే కుండను చేస్తాను.చాకలిలా దేహ రూపంలో ఉన్న వస్త్ర మలినాన్ని ఉతుకుతాను. మాదిగ వానివలె చర్మాన్ని సుందర రంగులతో అలంకరిస్తాను. అనేక భూమికలను పోషిస్తూ జాతి, ప్రాంత భేద భావాలను పోగొడతాను. గానుగవాడిలా నేను శరీరాన్ని గానుగలా మార్చి పాప పుణ్యాలను మరలో పెట్టి ఆడిస్తాను. పంచేంద్రియాలనే ఎద్దులను సహజమార్గంలో నడుపుతాను. రామ నామమనే తాడుతో వాటిని కడతాను. క్షత్రియుడనై వివేకం అనే కత్తిని పట్టుకుంటాను. యోగం, జ్ఞానంతో అలంకరిస్తాను. మంగలిలా మనస్సును ముండనం (గుండు) చేస్తాను. వడ్రంగిలా కర్మలను ముక్కలు చేస్తాను. అవదూతలా ఈ దేహాన్ని శుద్ధం చేస్తాను. వేటగాడిలా మనస్సును చంపుతాను. వ్యాపారినై శరీరంతో వ్యాపారం చేస్తాను. జూదరినై ప్రపంచాన్ని జయిస్తాను. దేహాన్ని నౌకలాచేసి మనస్సును పడవ నడిపే వాడిలా చేసి మాటను చుక్కానిలా చేస్తాను. ఈ విధంగా భవసాగరాన్ని నేను దాటుతాను. నా పూర్వీకులను కూడా దాటిస్తాను అని కబీర్ అంటున్నాడు."

* * *

11) ఓ యోగీ, మనస్సు యొక్క మర్గాన్ని తెలుసుకుని దానిని స్థిరం చేయి. దేనికోసం నువ్వు వెదుకుతున్నావో అది నీలోనే ఉంది. భ్రమతో బయట

ఎందుకు వెదుకుతున్నావ్? శరీరం లోపలే వనాలు, పర్వతాలు, సప్త సముద్రాలు వున్నాయి. శరీరంలోనే నక్షత్ర మండలాలు, సూర్యచంద్రులు ఉన్నారు. మమతను అణచివేసి సత్యం అనే ముద్రను, శీలం అనే ఆసనాన్ని స్థిరపరచు. అనాహత నాదాల యొక్క వాయిద్యాలు మ్రోగుతున్నాయి. ఓ యోగీ... వాటిలో నీ చిత్తాన్ని లీనం చేయి. సత్యం అనే భిక్షాపాత్రలా మారు. క్షమ అనే జోలె పట్టుకున్న యోగి శూన్యం లోంచి అనాహతనాదం వింటాడు. శూన్యం యొక్క వాయిద్యాన్ని మ్రోగిస్తాడు. నాటకం వేసేవాళ్ళు మాంత్రికులు వీరిచే యోగసాధన సంభవం కాదు. అంతటా వ్యాపించి వున్న పరమతత్త్వం ఏదైతే ఉందో అందులోనే యోగి రమిస్తూ ఉంటాడు. అతడు వాద వివాదాల్లోకి రాడు తన శక్తిని కోల్పోడు.

జ జ జ

12) " మానవ జన్మ అనే గొప్ప అవకాశం మళ్ళీ రాదు. రాముడు (ఆత్మ) లభిస్తే సంపూర్ణతత్త్వం ప్రాప్తించినట్లే అనేక జన్మలు వెళ్ళిపోయాయి. అనేకం వస్తాయి. అన్నీ వ్యర్థమైపోయాయి. ఈ నటుడు అనేక రూపాలలో అనేక వేషాలు వేస్తూ వస్తున్నాడు." కబీర్ ప్రార్థిస్తున్నాడు: "ఓ భగవంతుడా! అనంత దుఃఖాలను పోగొట్టుకునే మార్గాన్ని తెలియచేయి."

## పరమాత్మకై విరహం

1) " ఆత్మరాముణ్ణి విడిచి ఉండటం వలన పగలూ సుఖం లేదు! రాత్రీ సుఖం లేదు, కలలో సుఖం లేదు... ఎండలో సుఖం లేదు, నీడలో కూడా సుఖం లేదు."

* * *

2) " ఈ శరీరాన్ని దీపంలా చేసి, జీవాన్ని వత్తిలా చేసి రక్తాన్ని నూనెలా మారిస్తేనన్నా నువ్వు కనిపిస్తావేమో' అని కబీర్ ఆత్మారాముణ్ని వేడుకొంటున్నాడు."

* * *

3) " విరహాగ్నిలో నా తనువు, మనస్సు జ్వలిస్తున్నాయి! చనిపోయిన వాడికి అగ్ని బాధ తెలియదు ! పరమాత్మ విరహంలో ఉన్న నాకు మాత్రమే ఆ బాధ తెలుసు " అని కబీర్ అంటున్నాడు.

* * *

4) " ఓ స్వామీ ! ఈ విరహిణి.. జీవాత్మ.. నీ ప్రేమకోసం ధైర్యాన్ని కోల్పోయి తిరుగుతోంది. ఏ విధంగానైతే గొడ్రాలుకు ప్రసవ వేదన అర్థం కాదో... అలాగే ఎవరికైతే నీపట్ల ప్రేమలేదో వారికి ఈ విరహ బాధ అర్థం కాదు. రాముని విరహ బాణంతో గాయం చేయపడ్డవారే ఈ వేదనను అర్థం చేసుకోగలరు. ఎవరైతే

దీనిని సహిస్తున్నారో వారికే ఈ బాధ అర్థమవుతుంది. హే స్వామీ! ఈ జీవాత్మ నీ నుంచి విడిపోయింది. నీతో కలవలేకపోతోంది. అది నిన్ను కలుసుకునే ఉపాయాన్ని వెదుకుతోంది. పరమాత్మను కలుసుకోలేని జీవాత్మ దీనురాలై మిగిలిన జీవాత్మ రూపే సఖులను అడుగుతోంది. నన్ను ఎలాగైనా సరే రామునిలో కలపండి." కబీర్ అంటున్నాడు: " ఏ విధంగానైతే చేప నీటి కోసం వ్యాకుల పడుతుందో అదేవిధంగా జీవాత్మ పరమాత్మ కోసం తపిస్తోంది."

జ జ జ

5) " హే భగవాన్ (రామ్) ! నీకు తప్ప నా మనస్సులో ఉన్న బాధను మరెవరికి చెప్పుకోను. మనస్సులో నీ పట్ల ఉండే విరహం వలన ఎంతో దుఃఖాన్ని అనుభస్తున్నాను. ఈ జీవాత్మ విరహ రూపమనే బల్లెంతో గాయపరచబడింది. ఆ గాయం రాత్రి పగలు నా హృదయాన్ని బాధ పెడుతోంది. సద్గురువు యొక్క బాధను ఎవరు అర్థంచేసుకుంటారు? విరహంతో ఉన్న వ్యక్తి ఎలా జీవిస్తాడు. రాత్రి పగలు నీ కోసం చూస్తూనే ఉన్నాను. అయినప్పటికీ నువ్వు నా దగ్గరకు రాలేదు." కబీరు అంటున్నాడు: " హే మురారీ నేను చాలా దుఃఖంలో ఉన్నాను; నీ దర్శనం లేకుండా ఎలా జీవించగలను?"

జ జ జ

6) ఆత్మ రూపీ విరహిణి అంటోంది : " హే భగవాన్ ! నేను నిన్ను ఎప్పుడు చూస్తాను? నేను అహర్నిశలు నీ దర్శనం కోసం ఆత్రుత పడుతున్నాను. ఆ ఆతృత శరీరం అంతా వ్యాపించి వుంది. నా కళ్ళు నిన్నే కోరుకుంటున్నాయి. నీ వెతుకులాటలో అవి ఓడిపోవటం లేదు. నువ్వు నా గురించి ఆలోచించు; విరహాగ్నితో నా శరీరం దహించుకుపోతోంది. నా నివేదన విను; వినిపించుకోకుండా ఉండకు. ఓ స్వామీ ! నువ్వు ధైర్యవంతుడివి. నా శరీరం అనే పచ్చికుండలో ప్రాణం అనే నీరు సముద్రంలాంటి నీలో కలవాలనే ఆతురతలో ఉంది. చాలా రోజుల నుంచి నీ వియోగంలో ఉన్నాను. నా మనస్సుకు ఇక ధైర్యం లేదు! " కబీరు అంటున్నాడు: " నేను చాలా ఆత్రుత పడుతున్నాను; ఈ దేహంలో ఉండగానే నిన్ను కలుసుకునే కృపను ప్రసాదించు.' "

జ జ జ

7) "జ్ఞానం వలన యోగి యొక్క జోలి కాలిపోయింది ! భిక్షాపాత్ర కూడా ముక్కలైపోయింది ! యోగి తన స్వరూపంలో కలిసిపోయాడు; ఆసనం విభూతిగా మిగిలిపోయింది." అంతరార్థం : " జ్ఞానం వలన యోగి యొక్క 'జోలి' అంటే 'సంచిత కర్మలు', భిక్షాపాత్ర అంటే ప్రారబ్ధ కర్మలు 'కాలిపోయాయి' అప్పుడు జీవుడు ఈశ్వరుడవుతాడు....'

# ప్రేమ

1) " అంతఃకరణంలో ప్రేమ ఉదయించినప్పుడు ఆంతరంగం అంతా ప్రకాశవంతమౌతుంది. ముఖం నుంచి కస్తూరి వాసనలు వస్తూంటాయి. నోటి నుంచి దివ్య వాక్కులు వస్తాయి."

జ జ జ

2) " ప్రేమ రసం ఎంతో మధురంగా ఉంటుంది. కానీ దాన్ని పొందటం చాలా కష్టం; దాన్ని పొందాలి అంటే గురువు నీ శిరస్సును (అహంకారాన్ని) అడుగుతాడు."

జ జ జ

3) " ప్రేమ యొక్క కథను కొంచెం కూడా వర్ణించి చెప్పలేము. అది అకథనీయం. మూగవాడు తిన్న చక్కెరలా దాని తియ్యదనాన్ని కేవలం అనుభూతి చెందగలమే కానీ చెప్పలేము కదా! అలానే ఆత్మానుభూతిని కూడా చెప్పలేం. భూమి లేకుండా, బీజం లేకుండా ఉదయించే వృక్షం ఇది. దానినుంచి అనంత ఫలాలు ఉత్పన్నమవుతాయి ! మనస్సును స్థిరం చేసుకుని ఆలోచించి రామునిపై (ఆత్మజ్ఞానం) దృష్టి పెట్టగా ప్రపంచమంతా సారహీనంగా కనిపించింది." కబీరు అంటున్నాడు. " నా దగ్గర శక్తిలేదు. గురు సహాయం తోనే జననమరణ చక్రం నుంచి ముక్తి పొందాను. మనస్సు ఆత్మలో లయమైంది."

# మనోలయం

1) " నా మనస్సు పరమ తత్వంలో లీనమైపోయింది; విడిగాలేదు; ఉప్పు నీళ్ళలో కలిసిపోయినట్లుగా నా మనస్సు భగవంతుని మనస్సులో కలిసిపోయింది."

* * *

2) " నీరు మంచులా మారింది. మంచు కరిగి తిరిగి నీరులా మారింది. ఏదైతే వుందో అది అదే అయ్యి వుంది. అది ఏ మార్పు చెందలేదు !"

* * *

3) " నాది అయినది ఏదీ నాలో కొంచెం కూడా లేదు. ఏదైతే ఉందో అదంతా నీదే. నీది నీకే ఇచ్చేస్తున్నాను. నాది అనేది ఏముంది?

* * *

4) " ఇపుడు నేను రాజారామ్ (పరమాత్మ) స్నేహాన్ని పొందాను. అతనే లేకపోతే నా జీవితం అంతా దుఃఖమే ఉండేది. వేద, పురాణాలే ఇందుకు సాక్ష్యం.

ఏ తీర్థ వ్రతాలూ యమ పాశం నుంచి తప్పించలేవు. పరమాత్మను పొందితే మనిషికి దివ్య జీవనం లభించినట్లే. పాపం పుణ్యం అనే రెండింటి భ్రమ దూరం అవుతుంది.” కబీర్ అంటున్నాడు ! “ నా లోపల ఆ పరమతత్వం మేల్కొని ఉంది. ప్రేమ అనే బాణం గుచ్చుకుంది. అందువలన మనస్సు అతనిలో కలసి లీనమైపోయింది.”

* * *

5) “ ఓ సాధకుడా ! ఎప్పుడైతే ఆత్మారామునిలో రమిస్తావో సుఖసారాన్ని పొందుతావు. మనస్సులోని వికారాలను త్యజించకుండా వనాలలో నివసించటం వలన ఏం లాభం? ఎవడైతే ఇంటిలోనూ అడవిలోనూ సమానంగా ఉంటాడో.. అతడు ప్రపంచంలోకెల్లా అరుదైన వాడు. జడలు పెంచుకోవటం, భస్మాన్ని శరీరానికి పూసుకోవడం, గుహలలో నివసించటం వలన ఏం ఉపయోగం? ఎవరైతే విషయాల పట్ల ఉదాసీనంగా ఉంటారో, మనస్సును గెలుస్తారో వారు ప్రపంచాన్ని జయించినట్లే. ఎవరిలోనైతే సహజస్థితి ఉంటుందో అతను మానావమానాలకు అతీతుడు. ఎవరికైతే, పరాయి అనే భేదభావం నశిస్తుందో అతనికి ఆత్మారాముడు లభిస్తాడు. మనస్సు కనుక బహిర్ముఖం అవకుండా అంతర్ముఖం అయితే హృదయంలోనే శ్రీహరి లభిస్తాడు.”

## శరణాగతి

1) “ భగవంతుడు నువ్వు రా అని పిలిస్తే దగ్గరకు వెళ్తాను. దూరం దూరం అంటే దూరంగా వెళ్ళిపోతాను. భగవంతుడు నన్ను ఎక్కడ ఉంచితే అక్కడే ఉంటాను. ఏది ఇస్తే అదే తింటాను.”

* * *

2) “ ఓ భగవంతుడా నేను సంసారం యొక్క మోహాన్ని వదలలేదు. నా స్థితి మనస్సులో ఆశ, తృష్ణ ఉంచుకుని ఆకాశంలో ఎగురుతున్న పక్షిలా ఉంది. విషయ వాసనలు వదలిపెట్టలేని కారణంగా అది బంధ విముక్తిని పొందలేక పోతోంది. ఏ పని సుఖదాయకము అనుకుని చేస్తున్నాడో అది దుఃఖదాయకం అవుతోంది. ఏ విధంగా నైతే మగ ఏనుగు ఆడ ఏనుగుపై కోరికతో తనకు తానుగా బంధించుకుంటుందో అలాగే మనుష్యులు కూడా తమ జీవితాన్ని విషయవాసనలతో బంధించుకుంటున్నారు.” కబీరు అంటున్నాడు: “ ఓ దేవా! మురారీ నా వినతిని విను. ఈ బంధాల్ని దాటటం నావల్ల కాదు. వీటితో నేను భయపడుతున్నాను, యమదూతలకు భయపడుతున్నాను. నిన్ను శరణు వేడుతున్నాను.”

* * *

3) " ఓ దేవా ! నాపై దయ చూపించు. ఈ సాంసారిక భవబంధాల నుంచి విముక్తి పొందే మార్గం చూపించు. ముసలితనం, మరణం అనే దుఃఖాల నుంచి విముక్తుణ్ణి చేయి. ఏ ఏ కర్మలైతే జన్మలకు దారి తీస్తున్నాయో, నా మనస్సును ఆయా కర్మల నుంచి విముక్తుణ్ణి చేయి.సద్గురు చరణాలను పట్టుకుని అడుగుతున్నాను, 'ఈ జన్మ ఎక్కడ నుంచి వస్తోంది? ఏ కారణంతో ఈ ప్రపంచం ఉత్పన్నం మరి క్షయమవుతోంది? నాకు అర్థమయ్యేలా చెప్పు' ఆశా బంధాన్ని ఈ మనస్సు వదలలేని కారణంగా శూన్యంలో (సహస్రారం) ఉన్న ఆనందాన్ని పొందలేక పోతోంది. ఆత్మ నిర్వాణ స్థానాన్ని తెలుసుకోలేకపోతే, భయం లేకుండా సాంసారిక బంధాల నుంచి ఎలా ముక్తిని పొందగలదు? ఆత్మ ఎక్కడ నుంచీ పుట్టడం లేదు! ఎక్కడకూ చేరటం కూడా లేదు! అది ఏ భావాలూ లేనటువంటిది; ఉదయం, అస్తమయం (ద్వంద్వం) యొక్క చింత లేనప్పుడే సదా సహజతత్వంలో లీనమవ్వగలం. ఏ విధంగానైతే బింబంలో ప్రతిబింబం కలసిపోతుందో అలానే జ్ఞానం పొందిన తరువాత భ్రమ పోయి మనస్సు శూన్యంలో విలీనమైపోతుంది."

## మాయ

1) " జీవాత్మ అనుకుంటోంది, నా దేశం ఏది? ఎక్కడికి వచ్చాను? ఎందుకు వచ్చాను? అది ఎలా తెలుస్తుంది? మార్గం యొక్క జ్ఞానం లేదు; మరిచిపోయి ఈ ప్రపంచంలోనే తిరుగుతున్నాను".

* * *

2) కబీరు అంటున్నాడు : " మాయ అనేది మోహంలో పడవేస్తుంది. దాని వెనకాల పడితే అది దొరకదు. కానీ, అది అబద్ధమని దానిని దూరం చేశావా అది నీ చుట్టూ తిరుగుతుంది."

* * *

3) " మూడింటితో (సత్వ, తమో, రజో – ధర్మ, అర్థ, కామ) స్నేహం చేసేవారు చాలామంది లభిస్తారు! నాల్గవదాన్ని (గుణాతీత స్థితి, మోక్షం) కోరుకునే వారే లేరు! అందరూ ఆత్మస్వరూపులే అయినప్పటికీ మాయ కారణంగా పరాధీనులై ఉన్నారు."

* * *

4) కబీరు అంటున్నాడు; " నేను పరమతత్వాన్ని ఒక్కటే అంటున్నాను. ఎవరైతే ద్వైతంలో ఉంటారో వారు నరకాన్నే పొందుతారు. ఒక్కటే గాలి, ఒక్కటే నీరు, ఒక్కటే అగ్ని అన్ని చోట్లా సమానంగా ఉంది. ఒకే కుమ్మరిచే (ఈశ్వరుని)

కుండలన్నీ (శరీరాన్నీ) ఒకే మట్టితో నిర్మించబడ్డాయి. మాయలో పడి జనులందరూ గర్విస్తున్నారు. పరమ సత్యం ముందు నిన్ను నువ్వు సమర్పించుకో."

* * *

5) "మాయని నేను వదులుదాము అని అనుకున్నా, మాయ నన్ను వదలకుండా పదేపదే పట్టుకుంటోంది. బ్రహ్మజ్ఞానం ఎక్కడ వుంటే అక్కడ మాయ వుండదు. గౌరవం, సన్మానం మాయ యొక్క రూపాలే జపం, తపం, యోగం మాయ యొక్క రూపాలే. మాయ ఏదో ఒక రూపంలో ప్రజలందరినీ బంధిస్తోంది. భూమి, నేల, ఆకాశం అన్నిటిలోనూ మాయ నిండి ఉన్నది. తల్లి, తండ్రి, భార్య, పుత్రుడు అంతా మాయే రాముని ఆధారంతో కబీర్ మాయను వశం చేసుకున్నాడు.

* * *

6) "ఓ అవధూతా! ఈ విధంగా ఆలోచించు. చైతన్య పురుషుడి నుంచి 'మాయ' అనే స్త్రీ ఎలా జన్మించింది? 'మాయ' అంటోంది.. నేను శ్రీమతిని కాను, కుమారిని కాను! అనేక జీవులు అనే పుత్రులకు వయస్సులో ఉన్న యువతీ యువకులను వదలిపెట్టను. అయినప్పటికీ నేను కుమారిని ! బ్రాహ్మణుల ఇళ్ళల్లో బ్రాహ్మణిగానూ, యోగుల ఇళ్ళల్లో శిష్యునిగానూ ఉంటాను. అయినా ఒంటరిగానే తిరుగుతూ ఉంటాను. నేను పుట్టింటికి వెళ్ళను.. అత్తింటికి వెళ్ళాల్సిన పనిలేదు." (ఇహలోకం – పరలోకం) కబీర్ అంటున్నాడు: " ఓ సాధువుల్లారా! నేను మాయ స్పర్శకు దూరంగా ఉన్నాను."

* * *

7) " కబీరు అంటున్నాడు ! " నేను కనుక జ్ఞానం యొక్క రహస్యం తెలుసుకోలేకపోతే నాజన్మంతా వ్యర్థమైపోయేది. ఈ ప్రపంచం బజారు లాంటిది. జీవులందరూ వ్యాపారులు. నువ్వు తెలుసుకుని మేలుకో ! ఇక్కడకు వచ్చి మూర్ఖులైన ప్రజలు అతి విలువైన జీవితాన్ని పోగొట్టుకుంటున్నారు. ఈ సంసార చక్రంలో పడి కళ్ళు అలసిపోయాయి. వాణి అలసిపోయింది. సంసార క్రియాకలాపాలల్లో నిమగ్నమైన కారణంగా సుందర శరీరం కూడా అలసిపోయింది. జనన మరణం ఈ రెండింటిలో పడి జీవుడు అలసిపోయాడు. ఒక్క మాయ మాత్రమే అలవలేదు. ఈ శరీరంలో శ్వాస ఉండగానే ఓ చంచల మనసా మేలుకో. ఎల్లప్పుడూ హరిచరణాల దగ్గర ఉండు. భక్తిపోయినా భావం (అనుభూతి) ఉండాలి. ఎవరైతే జీవిత రహస్యం తెలుసుకుంటారో వారి జ్ఞానం నష్టపోదు."

* * *

8) " మాయ మోహంలో పడి నేను దానికి వశమయ్యాను. మాయ ద్వారానే ఈశ్వరుడు నా జ్ఞానాన్ని, ధ్యానాన్ని దొంగిలించాడు. జీవితం ఎలా స్వప్నమో

ప్రపంచం కూడా స్వప్నం లాంటిదే. సంసారాన్ని సత్యం అనుకుని ఈశ్వరుణ్ణి వదలిపెట్టి దానితోనే బంధింపబడి ఉన్నావు. అగ్ని ప్రకాశాన్ని చూసి కీటకం ఆనందిస్తుంది. కాని అగ్ని తీవ్రతను చూడలేక పోతోంది. కామినీ కాంచనాల కారణంగా కాలం అనెడి పాశంలో బంధింపబడి ఉన్నావు. విచారణ చేసి వికారాలను వదలి పెడితే భవసాగరం నుంచి తరించబడతావు.

* * *

9) "రామ నామం.. (ఆత్మారామ్) యొక్క మర్మం తెలియకుండా ప్రపంచమంతా మాయా మోహంలో అంధులుగా జీవిస్తున్నారు. పుట్టుకతో నువ్వు ఏం తెచ్చావు? మరణించాక ఏం పట్టుకెళ్తావ్? ఏ విధంగానైతే పక్షులు చెట్లమీద నివసిస్తుంటాయో అలా నాలుగు రోజుల పాటు ఈ భూమి మీద ఉంటావు. నీ గొప్పలు చెప్పుకుంటావు. ఇతరులను నిందిస్తావు. హరి భక్తి లేకుండా ఈ దేహం యాతనలు పడి నశిస్తోంది. కామ, క్రోధ, లోభ, మోహ మద మాత్సర్యాలకు దూరంగా ఉండు. ఇతరుల అపవాదులను వినకు. సజ్జన సాంగత్యం చేయి. రామనామ గుణగానం చేయి."

* * *

10) " ఓ రామా! నేను నిన్ను మరచిపోయాను. నువ్వే నాకు అర్థమయ్యేటట్లు చెప్పు. నా చంచల చిత్తం విషయ వాసనలు అనే వనంలో తిరుగుతోంది. నీ ధ్యాసలో ఉండటం లేదు. సంసార సాగరంలో పడి మర్చిపోయాను. దీన్ని దాటే ఉపాయాన్ని వెదుకుతూ అలసిపోయాను. ఓ రామా.. మాయా మోహిని అనే పులి నుంచి నన్ను రక్షించు. ఓ గోపాలా నా వినతిని విను నా శరీరంలో సద్బుద్ధిని స్థిరంగా ఉంచు." కబీర్ అంటున్నాడు : " కామము శత్రువు వంటిది అది అందర్నీ చంపి కూలదోస్తుంది."

* * *

11) " ఓ పిచ్చివాడా! నువ్వు జ్ఞాన – వివేకాలను ఆశ్రయించకుండా జన్మను వ్యర్థం చేసుకున్నావు. నేత్రాలు అలసిపోయాయి, విని విని చెవులు అలసిపోయాయి. సుందర శరీరం కూడా అలసిపోయింది. జనన మరణాలను పొందుతూన్న జీవుడు అలసిపోయాడు. కానీ, మాయ అలసిపోలేదు. ఓ చంచల మనసా! ఎప్పటివరకైతే ఈ దేహంలో శ్వాస ఉంటుందో అప్పటి వరకు చైతన్యంగా ఉంటావు. శరీరం వరకు మాత్రమే ఈశ్వరుణ్ణి శరణు వేడుకునే భావం లేకపోతే అతని చరణాల దగ్గర నివాసం ఎలా దొరుకుతుంది? ఎవరైతే జ్ఞానంతో అజ్ఞేయుడను భజిస్తారో వారికి కొంచెం కూడా నష్టం కలుగదు. ఎవరైతే తెలుసుకుని పాచికలాట ఆడితే, వారు ఎప్పటికీ ఓడిపోరు."

* * *

12) " మాయ ఒక గొప్ప మోసగత్తె అని నేను తెలుసుకున్నాను; త్రిగుణాలనే వలను చేతిలో పట్టుకుని మధురమైన మాటలు మాట్లాడుతూ తిరుగుతూ ఉంటుంది. కేశవుని దగ్గర 'కమల'లా శివుని దగ్గర 'భవాని'లా కూర్చుంటుంది. పండితుల దగ్గర 'విగ్రహం'లా, తీర్థాలలో 'నీటి'లా ఉంటుంది. యోగి దగ్గర యోగినిలా, రాజుకు రాణి రూపంలో వెలుగొందుతూ ఉంటుంది. ఒక్కోచోట అమూల్యమైన వజ్రంలా ఉంటుంది. మరొకచోట పనికిరాని గవ్వలా ఉంటుంది. భక్తుల దగ్గర భక్తురాలులా, తురకవాని దగ్గర తుర్కినీలాగా కూర్చుని ఉంటుంది. " కబీర్ అంటున్నాడు; "భగవానుని యొక్క దాసుల చేతల్లో ఈ మాయ అమ్మబడింది."

* * *

13) " ఓ అవధూతా! మాయను త్యజించడం కష్టం; ప్రజలు గృహాన్ని (సంసారాన్ని) వదలి వేషం (సన్యాసి) ధరిస్తున్నారు. వస్త్రాల్ని వదలి భిక్షకోసం ఇల్లిల్లూ తిరుగుతున్నారు. బాలురు దీక్షపొంది శిష్యులు అవుతున్నారు. అక్కడ కూడా బుద్ధి మాయతో ప్రభావితం అవుతోంది. ఏ విధంగానైతే తీగ తోటలోని వృక్షాలలో చిక్కుకుని ఉంటుందో అదే విధంగా జీవుడు మాయలో చిక్కుకుని ఉన్నాడు. కోటి ఉపాయాలు చేసినప్పటికీ దాని నుంచి విడిపించుకోలేదు. కామాన్ని త్యజించటం వలన క్రోధం పోదు. అహంకారం పోదు, దాని నుంచి అభిమానం అనే తీవ్ర కోరిక పోదు. మనస్సు కనుక విరక్తిచెంది మాయను వదలిపెడితే అనాహతంలో చైతన్యం కలిసిపోతుంది. ఈ రహస్యాన్ని ఓ ప్రత్యేక వ్యక్తి మాత్రమే తెలుసుకోగలుగుతాడు అంటున్నాడు కబీరు."

* * *

14) "మనమే స్వయంగా మన ఆత్మతత్వాన్ని మర్చిపోయాం. ఏ విధంగానైతే కుక్క అద్దాల గదిలో తన ప్రతిబింబాన్నే చూసుకుని మొరిగి మొరిగి మరణిస్తుందో, ఒకానొక సింహం నూతిలోని నీటిలో తన ప్రతిబింబాన్ని చూసి దానితో దెబ్బలాడాలని నూతిలో ఉరుకుతుందో.. అదే విధంగా మత్తెక్కిన ఏనుగు స్ఫటిక శిలపై తన బింబాన్ని చూసి దానిని తన దంతాలతో పొడిచి దెబ్బలాడుతుంది. కోతి తినటం కోసం చేతినిండా ధాన్యం ఉంచుకుని పాత్రలోంచి చేయి రాని కారణంగా దుకాణదారునికి దొరికి ఇంటింటికీ తిరిగి దెబ్బలు తింటూ ఉంటుంది.లోహపు కడ్డీని పట్టుకుని కూర్చున్న రామచిలుక ఆ లోహపు కడ్డీ తనను పట్టుకుందనీ భ్రమిస్తూ అలానే ఆ లోహపు కడ్డీని పట్టుకుని వదలకుండా ఎగిరిపోకుండా కూర్చుంటుంది. అదే విధంగా జీవుడు సంసారం యొక్క మాయా మోహంలో స్వయంగా పడ్డాడు."

* * *

15) ఏ పరమాత్మ ఈ సృష్టి యొక్క రచన చెప్పటం కోసం, వినటం

కోసం చేశాడో ఈ సృష్టి యొక్క యథార్థ స్వరూపాన్ని ఎవ్వరూ తెలుసుకోలేదు. ప్రపంచం అంతా ఆ భ్రమలోనే ఉంది. సత్వ, రజ, తమో గుణాలనుంచే ఈ మాయ యొక్క సృష్టి జరిగింది. ఆ పరమాత్మ తత్వం స్వయంగా తనలోనే (జీవుడు) దాగి ఉంది. ఆ పరమాత్మ స్వయంగా ఆనంద స్వరూపుడు. భక్తి యొక్క వృక్షం. ఆ పరమతత్వం యొక్క విస్తారం; త్రిగుణాలు ఆ వృక్షం యొక్క ఆకులు. దాని కొమ్మ అనే శరీరంలో జ్ఞానరూపంలో ఉన్న పుష్పాలు వికసించాయి. రామనామం దాని నుంచి వచ్చే ఫలం! నిరంతరం అచేతన అవస్థలో ఉన్నటువంటి జీవాత్మరూప పక్షి చైతన్యవంతమై పరమాత్మ రూపంలో ఉన్న వృక్షంలో నివసిస్తుంది. మాయా మోహంతో ఉన్న ఈ అబద్ధపు ప్రపంచంలో పడి నిన్ను నువ్వు మర్చిపోకు.

## బంధం

" ఈ ప్రపంచం 'నీది', 'నాది' అనే తాళ్ళతో బంధింపబడి వుంది. కుటుంబం, పుత్రుడు, భార్య అనే బంధాలే నీకు పదే పదే దుఃఖాన్ని కలుగ చేస్తున్నాయి.

## దేహమే దేవాలయం

1) " ప్రపంచం అంతా దేవాలయాలకు వెళ్ళి నమస్కరిస్తున్నారు. నీ హృదయంలోనే హరి ఉన్నాడు; అతనిని తెలుసుకో."

* * *

2) " మనస్సు మక్కా, హృదయం ద్వారక, శరీరం కాశీ అనుకో! పది ద్వారాలు గల ఈ దేహంలోనే ఆత్మ జ్యోతి వెలుగుతోంది."

* * *

3) " ముస్లింలు మసీదులు, హిందువులు దేవాలయాలు తమవి అనుకుని పరుగులు పెడ్తున్నారు. చైతన్య పురుషుడు ఈ శరీరం లోనే ఉన్నాడు. అతనిని ఎవ్వరూ తెలుసుకోవటం లేదు."

* * *

4) " ఇప్పుడు నేను ఏ ఇంటికైతే తీసుకు రాబడ్డానో అదే నాకు ప్రియమైనది. 'యోగం', 'భోగం' రెండూ ఇంటిలోనే ఉన్నాయి. ఇంటిని వదలిపెట్టి అడవులకు వెళ్ళకు ! యుక్తి, ముక్తి.. రెండూ గృహస్థ జీవనంలోనే ఉన్నాయి! గురువు అనంత బ్రహ్మను సాక్షాత్కరింప చేయాలి అనుకుంటే సాధకుడైన జీవుడు సహజంగానే సమాధిస్థితిని పొందుతాడు. సహస్రార స్థితిలో లయం అవుతాడు. అతడు ఆ మౌనస్థితిలో బ్రహ్మను తెలుసుకుంటాడు, ఆ పరమ తత్వాన్ని ధ్యానిస్తాడు. సురతి ఆత్మద్వారా వీక్షించే (ఉచ్ఛ్వాస) శక్తిని నిరతి ఆత్మ ద్వారా వినే (నిచ్ఛాస) శక్తిని కలిపి

అనాహత నాదాన్ని ధ్వనిస్తాడు.ఇంటిలోనే ఉండు ! ఇంటిలో అన్ని వస్తువులూ ఉన్నాయి. ఇల్లే వస్తువును (బ్రహ్మాన్ని) ప్రాప్తించేలా చేస్తుంది.” కబీర్ అంటున్నాడు: “ ఇంటిలో ఉంటూనే మనయొక్క మూల స్వరూపంలో స్థితం అవ్వచ్చు.’ ”

* * *

5) “ ఓ సాధూ సహజంగా నీ శరీరాన్ని శోధించు. ఏ విధంగానైతే వటవృక్షం తన బీజంలోనే స్థితమై ఉంటుందో, విత్తనంలోనే ఆకులు, పుష్పాలు, పండ్లు ఉంటాయో, అదే విధంగా శరీరం మధ్యలోనే బీజరూపంలో పరమాత్మ విరాజిల్లుతున్నాడు! ఆయనలోనే ఈ శరీరం యొక్క అస్తిత్వం వుంది. అగ్ని, గాలి, నీరు, భూమి, ఆకాశం ఆ బీజం లేకుండా లభించవు. ఓ ఖాజీ (ముస్లిం మతగురువు) ! పండితులారా! నిర్ణయం తీసుకోండి.. ఆత్మ ఏదో ఒక ‘వస్తువు’ కాదు. అంతా తానై ఉంది ! ఏ విధంగానైతే నీటితో నింపబడిన కుండను నీటి మధ్యలో ఉంచితే దాని బయట లోపల అంతా ఒక్కటే తత్వం వున్నట్లే.. ఈశ్వరుని యొక్క అంశ ఆత్మరూపంలో ఈ దేహంలో పూరించబడి ప్రకాశిస్తోంది! ఆ పరమాత్మను ఏదో ఒక ‘నామం’తో పిలవటం వలన దైవత్వం యొక్క మోసంలో పడుతున్నాము.” కబీర్ అంటాడు: ఆత్మతత్వం యొక్క సారం సత్యం; ఆత్మ యొక్క మధ్యలో ఆత్మే మాట్లాడుతోంది ! ఆత్మే సృష్టికర్త కూడా !”

* * *

6) కబీరు అంటున్నాడు: “నా శరీరంలో నా మనస్సు స్థిరంగా లేదు. అందువలన ఈ మనస్సు అనేక శరీరాలతో అనేక జన్మలు ఎత్తుతూ వస్తోంది. గృహస్థు, వైరాగ్యం.. ఈ రెండు స్థితులలోనూ నిరాశే లభించింది. ఎక్కడ చూసినా జరా – మరణాలు, శోక – సంతాపాలు వ్యాపించి వున్నాయి. ఓ భగవాన్ ! ఈ ఇంటిలోనే (శరీరం) పరమానందాన్ని పొందే విధం చెప్పు.’ ”

## వేషం

1) “జపమాల చేతిలో తిరుగుతోంది ! నాలుకతో హరి మంత్ర జపం జరుగుతోంది ! కానీ, మనస్సేమో అటూ.. ఇటూ పది దిశలలో పరుగెడుతోంది; ఇది జపం కాదు.”

* * *

2) “తల వెంట్రుకలను వందసార్లు ఎందుకు కత్తిరించుకుంటున్నావు? అంతకంటే మనస్సులో ఉన్న విషయ వికారాలను కత్తిరించుకో !”

* * *

3) “ శరీరం వరకు యోగి వేషం అందరూ వేస్తారు; మనస్సులో ఆ యోగత్వం ఉండదు; ఎవరికైతే ఆ స్థితి సహజంగా లభిస్తుందో అతడే నిజమైన యోగి.”

## నిస్వార్థం

" స్వార్థం కారణంగానే ప్రజలందరూ కలిసి ఉన్నారు. ఎవరైతే స్వార్థాన్ని విడిచిపెట్టి ఎదుటివారిని ఆదరిస్తారో వారే భగవంతునికి ప్రీతి పాత్రులు."

## సాధు మహిమ

" వజ్రాలు రాశులుగా లభించవు. హంసలు కూడా వరుసలుగా ఉండవు. సింహాలు కూడా గుంపులుగా ఉండవు. అలాగే సాధుపురుషులు కూడా గుంపులుగా తిరగరు."

## మార్గాతీతం

" కేవలం ప్రాపంచికంలోనే ఉండేవాడు మానవుడు ! ఆధ్యాత్మికతలో ఉండేవాడు సాధువు. రెండింటినీ వదిలివేసినవాడు మహాత్ముడు."

## భ్రమ

1) " జనన మరణాల గురించిన అనుమానాలు విడిచిపెట్టు. ఆత్మ జన్మించడం, మరణించడం.. రెండూ భ్రమలే ! పంచతత్వాలతో తయారైన శరీరం పంచభూతాలలోనే కలిసిపోతుంది; మనస్సు పరతత్వంలో కలసిపోతుంది" అని కబీర్ అంటున్నాడు.

* * *

2) " హరి ఒక్కడే సత్యం.. మిగిలిన వ్యవహారమంతా అబద్ధం ! అతని కోసం మూర్ఖులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వ్యర్థమే. ఆత్మారాముడు లేకుండా జపం, తపం, జ్ఞానం, ధ్యానం అంతా అబద్ధమే. విధి, నిషేధాలు, పూజా, ఆచారాలు.. ఇవేమీ సంసార సాగరాన్ని దాటించలేవు. ఇంద్రియాల స్వార్థం మనస్సు యొక్క రుచికోసమే ! ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఎక్కడ సత్యం వున్నదో దాని గురించి అనేక వివాదాలు వున్నాయి. ఆ సత్యాన్ని పట్టుకుంటే భ్రమతో కూడిన కర్మల నుంచి స్వేచ్ఛను పొందుతావు."

## నిశ్చింత

1) " ఓ జీవుడా ! తినటం కోసం ఎందుకు ఏడుస్తున్నావ్? ఆ రచనాకారుణ్ణి గుర్తించి హృదయంలో ప్రవేశించి ఆత్మలో స్థితమై హాయిగా నిదురించు; ఏ విషయంలోనూ చింతించాల్సిన అవసరం లేదు."

* * *

2) “ ఓ మానవుడా ! నీకు ఏ రకమైన చింతా వద్దు. చింతారహితుడవై జీవించు. సాయి సర్వసమర్థుడు. పశు, పక్షి, జీవ, జంతువుల దగ్గర ఏ ధనం వుంది? అవి జీవించడం లేదా?

## కర్త

కబీరు అంటున్నాడు: “నువ్వు చేయటం వలన పనులేమీ జరగటం లేదు. చెయ్యకుండగానే అన్ని పనులూ జరుగుతున్నాయి. నీ ద్వారా ఏ పనులైతే జరుగుతున్నాయో వాటి కర్త కూడా పరమాత్మే.’ ”

## శూరుడు

1) “ ఎవరైతే మనస్సుతో యుద్ధం చేసి ఐదుగురు సైనికుల్ని (శబ్ద, స్పర్శ, రస, గంధ, రూప) పారిపోయేటట్లు చేస్తారో, ద్వైత భావాన్ని దూరం చేస్తారో, వారే నిజమైన శూరులు.”

ж ж ж

2) “ ఎలాగైతే శూరుడు తన స్వామి కోసం శరీరం ముక్కలైపోయినప్పటికీ యుద్ధక్షేత్రాన్ని వదలి రాడో... అదే విధంగా ఆత్మజ్ఞానం కోసం ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ సాధనను విడువరాదు.”

ж ж ж

3) “ ఏ మరణం కోసమైతే ప్రపంచం అంతా భయపడుతోందో అది నాకు ఆనందదాయకం. ‘ఎప్పుడు మరణిస్తాను?’ ఎప్పుడు ఆ పరమాత్మను చూస్తాను? ‘ ఎప్పుడు పూర్తి ఆనందాన్ని పొందుతాను?’ అని ఎదురు చూస్తూ ఉంటాను.”

## సాక్షి

“ కబీర్ రాముణ్ణి అడుగుతున్నాడు: “ సమస్త భువనాలకూ రాజుగా ఉండి కూడా అన్నింటికీ విడిగా సాక్షిగా ఎలా ఉండగల్గుతున్నావు? ఆ పద్ధతిని మాకు కూడా చెప్పు.”

## మేల్కొలుపు

కబీర్ తన మనస్సును సంబోధిస్తూ ఇలా అంటున్నాడు: “ ఓ సోదరా నీ మనస్సును మేల్కొలుపు! అజాగ్రత్తగా ఉండి నిద్రపోవటం వలన దొంగలు నీ ఇల్లంతా దోచుకుని పోతారు. షట్ చక్రాల బంగారు కోటలో చైతన్యం విరాజిల్లుతోంది. సాధనలో కుండలినీ జాగృతమైనప్పుడు ఈ కోట తాళం సులభంగా వచ్చేస్తుంది;

పంచేంద్రియాలు అనే కాపలాదారులు నిద్రపోతారు. లోపల వున్న ఆత్మశక్తులన్నీ మేల్కొంటాయి. జనన మరణాలకు సంబంధించిన ఆలోచనలు మనస్సులోకి రావు. రామరత్నం అనే ధనాన్ని ఎప్పుడైతే పొందానో నాలోని సంశయాలన్నీ తీరిపోయాయి."

## సుఖలాలస

" విషయాలలోనే సుఖం వున్నదనే ఆశ ఇప్పటికీ ఉంది. అందుకే ప్రజలు హరి చరణాలను పట్టుకోవడం లేదు. సుఖాన్ని కోరుకుంటే ముందు దుఃఖమే వస్తోంది కనుక సుఖాన్ని కోరకు. శివుడు, బ్రహ్మ ఏ సుఖాన్నైతే చూసి భయపడుతున్నారో ఆ సుఖాన్ని నువ్వు సత్యం అనుకుంటున్నావు. సుఖాలను వదిలి పెట్టేస్తే అన్ని దుఃఖాలు తమంతట తామే వెళ్ళిపోతాయి. చంచలత్వాన్ని ఎపుడైతే వదలిపెట్టానో రామనామం పైన నా మనస్సు లగ్నమైంది."

## బాహ్య ఆడంబరాల ఖండన

1) "జీవుడు ఏదో ఒక రోజు వెళ్ళిపోవలసిన వాడేనన్న సత్యం తెలుసు కున్నాను. ఎవరైతే కనిపిస్తారో వారందరూ మట్టిలో కలిసిపోతున్నారు. నారబట్టలు కట్టుకుని అడవులలో ఉంటూ తపస్సు చేయడం వలన ఏం వస్తుంది. రాళ్ళను పూజిస్తూ శరీరాన్ని శుభ్రం చేసుకోవడం వల్ల ఏం వస్తుంది? దేవుళ్ళు, మునులు యొక్క ఉపదేశాలు ప్రజలను ప్రాపంచికంలోనే ఉండేటట్లు చేస్తున్నాయి. కానీ, అమరత్వాన్ని ప్రసాదించటం లేదు. వినండి సాధువుల్లారా భక్తజనులందరూ హరిని స్మరిస్తూ ధ్యానసాధన చేయకపోతే వారి జీవితం వృధా! హరిలేని జీవితం వ్యర్థం."

* * *

2) " దిగంబరంగా ఉండటం వలన కానీ, రకరకాల వస్త్రాలు ధరించటం వలన కానీ ఆత్మారాముణ్ణి పొందలేవు! 'నగ్నంగా తిరగటం వలన భగవంతుడు లభిస్తాడు అనుకుంటే అడవిలో జంతువులన్నీ ముక్తిని పొందేవి ! కానీ ఒక్క జంతువు కూడా ముక్తి పొందలేదు ! " గుండు చేయించుకోవటం వలన సిద్ధి లభిస్తుంది అనుకుంటే గొర్రెలన్నీ ఎప్పుడో స్వర్గాన్ని చేరేవి.' బ్రహ్మచర్యం పాటిస్తేనే పరమ తత్వాన్ని తెలుసుకుంటారు అనుకుంటే విత్తు తెగ్గొట్టిన పశువులకు పరమ గతి ప్రాప్తించలేదు. పాండిత్యం వలన అహంకారం వస్తుంది.. దానితో వారు మధ్యలోనే మునిగిపోతారు. అటు భౌతికతకూ ఇటు ఆధ్యాత్మికతకు పనికిరారు! రామనామం (ఆత్మజ్ఞానం) మాత్రమే సిద్ధిని ప్రసాదిస్తుంది."

* * *

3) " ఆత్మజ్ఞానం లేని జీవితం అంధకార గుహలాంటిది. వారి తలపై యమపాశం ఉంటుంది. దేవుళ్ళను పూజిస్తూ హిందువులు మరణిస్తున్నారు. ముస్లింలు హజ్ యాత్రలు చేస్తూ మరణిస్తున్నారు. జడలు, ముడులు పెంచుకుని యోగులు మరణిస్తున్నారు.వీరెవ్వరూ భగవంతుడ్ని పొందడం లేదు. కవులు కవితలు రాసే అహంకారంతో మరణిస్తున్నారు. సాధువులు గుంపులుగా కేదార యాత్రలుచేసి మరణిస్తున్నారు. జైన మునులు గుండు చేయించుకుని మరణిస్తున్నారు. వీరెవ్వరూ పరమ సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నారు. ధనాన్ని సంపాదిస్తూ, రాజులు, బంగారం ఉన్నవారు మరణిస్తున్నారు. వేదాలు చదివే పండితులు మరణిస్తున్నారు. తన రూపం పట్ల అహంకారంగా వున్న స్త్రీలు మరణిస్తున్నారు. ఎవరైతే యోగాన్నీ, జ్ఞానాన్నీ తెలుసుకుంటారో ఆ సత్యాన్ని (ఆత్మతత్వాన్ని) తన శరీరంలోనే వెదుకుతారు. వారికి ముక్తి కలగటంలో ఎలాంటి సంశయము లేదు " అని కబీర్ అంటున్నాడు.

* * *

4) " వేదాలు, పుస్తకాలు లోకాచారాలను వర్ణించాయి. మరణించిన తరువాత దేహాన్ని బూడిద చేస్తారు. ఏడుస్తూ మరణించిన వారిపట్ల తన ప్రేమనూ, స్నేహాన్నీ చూపుతారు. జీవించి ఉన్నప్పుడు తండ్రిని బాధిస్తారు, మరణించిన తరువాత గంగలో భస్మాన్ని కలుపుతారు. జీవించి ఉన్నప్పుడు తండ్రికి అన్నం పెట్టరు కానీ, మరణించిన తరువాత పిండ ప్రదానం చేస్తారు. జీవించి ఉన్నప్పుడు తండ్రిని కఠిన వచనాలతో హింసిస్తారు. మరణించిన తరువాత శ్రాద్ధ ఖర్మలు చేస్తారు." కబీరు అంటున్నాడు: " నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. శ్రాద్ధ పిండాన్ని కాకులు తింటే అది మరణించిన ఆత్మకు ఎలా చేరుతుంది?"

* * *

5) " ఆసనాన్ని బంధించి ప్రాణవాయువును దృఢపర్చు. మనస్సు యొక్క కల్మషాన్ని వదలిపెట్టు. వాయిద్యాలు మ్రోగించటం వలన, ముద్రలు (నామాలు) ధరించటం వలన ఏం లాభం? దేహం అంతా విభూతి పూసుకోవటం వలన లాభం ఏమీ ఉండదు. ఎవరైతే సరియైన నమ్మకంతో ఉంటాడో అతనే నిజమైన 'హిందువు'. అతడే నిజమైన 'ముస్లిం'. బ్రహ్మజ్ఞానం గురించి చెప్పేవాడు 'బ్రాహ్మణుడు'. పరమాత్మను (రహీమును) తెలుసుకున్న వాడే 'ఖాజి'. రెండవ వైపుకు వెళ్ళకుండా కేవలం రామనామ జపం చేసి లాభాన్ని పొందు" అంటున్నాడు కబీర్.

* * *

# విశ్వాసం

" ఆత్మారాముడి కంటే వేరొకరు లేరు. ఏ విశ్వాసంతో పూజ చేస్తున్నావు? విశ్వాసం లేకుండా ఆకులు పూలు తెంచుతున్నావు. జ్ఞానం లేకుండా దేవాలయాలకు వెళ్ళి సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నావు. పిలుస్తే పలికే రాముడు నీ దగ్గర ఉండగా దేవాలయాల ముందర నిలబడి రాముణ్ని పిలుస్తున్నావు. ఎవరైతే ఆత్మతత్వం పట్ల విశ్వాసం ఉంచుతారో కబీర్ వారికి దాసోహం !"

# "మూర్తి పూజ యొక్క ఖండన"

" ఆకు ఆకులో జీవం వన్నది. అది మరచిపోయి వాటిని కోస్తున్నావు ! ఏ మూర్తి కోసమైతే పుష్పాలు, పత్రాలు కోస్తున్నావో ఆ మూర్తి నిర్జీవమైనది. శిల్పి మూర్తిని చెక్కేటప్పుడు మూర్తి యొక్క గుండెలపై కాలు వేసి చెక్కుతాడు. మూర్తిలో శక్తి వుంటే తనను తయారు చేసే వాడినే తినేసేవాడు. విగ్రహానికి లడ్డు, నెయ్యి, పాయసం మొదలైనవి సమర్పించి పూజ చేస్తారు. వీటన్నింటినీ పూజారి పట్టుకెళతాడు.. విగ్రహానికి ఏం పెడ్తారు? ఆకులలో బ్రహ్మ, పుష్పాలలో విష్ణువు, పండ్లు – పూలలో మహదేవుడు వున్నాడు. ఈ ముగ్గురిలో ఒక్కటే చైతన్యం వున్నది. ఎవరికి సేవ చేస్తావు? ఒక్కరు కాదు ఇద్దరూ కాదు, ప్రపంచమంతా భ్రమలోనే ఉంది ! ఒక్క కబీర్ ఆత్మారాముని ఆధారం వలన భ్రమ నుంచి ముక్తిని పొందాడు."

# సాధనా శరీరం

కబీర్ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాడు: " భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ఈ శరీరం గొప్ప సాధనం. సాధనా శరీర రూపంలో ఉన్న కుబుసాన్ని ఆత్మ నుంచి వేరు చేయకు. ఎవరికైతే అనుభవం వుందో వారే దీని అర్థాన్ని తెలుసుకోగలరు. శరీర రూపంలో వున్న వస్త్రాన్ని తయారు చేయటానికి భగవంతుడు వెదకి అందమైన మగ్గాన్ని తెచ్చి తొమ్మిది రంగులలో నింపాడు. సూర్య చంద్రులను (ఇడ పింగళ నాడులను) ఒకచోట కలిపాడు. ఈ వస్త్రాన్ని నేయటానికి చాలా సమయం పట్టింది! ఆ వస్త్రాలను పంచేంద్రియాలు, వజ్రాలు, ముత్యాలు (జ్ఞానవైరాగ్యాలను) తో నింపాడు. కోటి సంవత్సరాల సాధనా ఫలితంగా ఈ శరీరం నిర్మించబడింది ! దేవతలు, మనుష్యులు ఇంకా సంసార బంధనాలలోనే ఉన్నారు. ఏ వ్యక్తి అయితే రాత్రి పగలు నిద్రపోకుండా సాధనలో ఉంటాడో ఆ వ్యక్తిని కాలం ఏమీ చేయలేదు ! గురుకృపచే శరీరం సహజ స్వరూపంలో కలిసిపోతుంది."

# ప్రవృత్తి - నివృత్తి

" సాధకుడు అంటున్నాడు... సజ్జన సాంగత్యం వలన నివృత్తి రూపంలో స్త్రీ నా ఇంటిలో నివసిస్తోంది. ప్రవృత్తి రూపంలో స్త్రీ ముందే ఉన్నప్పటికీ నేను తిరుగుతూనే ఉన్నాను. సత్యం ఎక్కడా లభించలేదు. ఇప్పుడు కొత్త స్త్రీ (ఆత్మజ్ఞానము) లభించగానే నా సమస్త భ్రమ దూరమైంది. మొదటి భార్య (ప్రవృత్తి మార్గము) సదా కులవతిగా ఉంటూ అత్త, మామ, మరిది, బావ ఇలా అందర్నీ ప్రేమిస్తూ భర్తను నిర్లక్ష్యం చేసింది. (సంసార బంధాలలో పడి ఆధ్యాత్మికతను వదలివేసింది) కొత్త భార్య (నివృత్తి మార్గము) ను ఎప్పుడైతే గ్రహించానో అప్పటి నుంచి నాకు ఆమె సాంగత్యం లభించింది. ఇందుకు కబీర్ రామునికి కృతజ్ఞతలు చెపుతున్నాడు."

# గమ్యం

" ఓ మానవుడా! భగవంతుడి కంటె మిగిలిన వస్తువులన్నీ వ్యర్థాలు అని తెలుసుకో. నువ్వు దూరం వెళ్ళాలి. వెంటనే ప్రయాణం మొదలుపెట్టు. ఇది నీ స్థానం కాదు. ఇక్కడ ప్రియమైన వారు, దోస్తులు ఎవ్వరూ లేరు. ఖర్చు పెట్టుకోవటానికి పుణ్యం లాంటివి కూడా నీ దగ్గర లేవు. ఈ యాత్రలో ఒంటరిగానే వెళ్ళాలి. మధ్యలో విశ్రాంతి తీసుకోవడానికి లేదు. (జన్మ తరువాత జన్మ). సంసార సాగరాన్ని దాటడం కఠిన విషయం. అందువలన హరి నామాన్ని (ధ్యానాన్ని) స్మరణం చేయి. నువ్వు ఎక్కడికైతే వెళ్తామనుకుంటున్నావో ఆ నగరం సర్వసంపన్నమైనది."

# అంతఃకరణ శుద్ధి

1) " ఓ అజ్ఞానీ! ఎప్పుడూ సంసారిక చింతల గురించే ఆలోచిస్తూ హరినామాన్ని ఎందుకు స్మరణ చేయవు? ఈ శరీరం అనే కోటలో 5గురు దొంగలు వున్నారు. వారు రాత్రి పగలు ఈ కోటను కొల్లగొడుతున్నారు. శరీరంలో ఉండే స్వామి కనుక ధృడంగా ఉంటే ఈ కోటను ఎవ్వరూ కొల్లగొట్టలేరు. అజ్ఞానం అనే అంధకారాన్ని దూరం చేయటానికి జ్ఞానదీపం కావాలి. ఆ దీపంతో అంతవరకు కనిపించని పరమతత్త్వం లభిస్తుంది. ఆ పరమ తత్వ సాక్షాత్కారంతో ఈ జ్ఞాన దీపం కూడా అతనిలో కలిసిపోతుంది. ఎవరైనా ఆ పరమతత్వాన్ని సాక్షాత్కరించుకోవాలి అనుకుంటే తమ అంతః కరణం అనే అద్దాన్ని శుద్ధంగా ఉంచుకోవాలి. ఎంతవరకైతే ఆ అద్దం విషయ వాసనలతో మురికిగా ఉంటుందో... అంతవరకు పరమతత్త్వం యొక్క సాక్షాత్కారం జరగదు. చదవటం, మననం

చేసుకోవటం వేద, పురాణాలు వినటం వలన ఏం లాభం? వీటివల్ల అహంకారం పెరుగుతుంది." కబీర్ అంటున్నాడు: " ఆ తత్వాన్ని నేను సహజంగానే పొందాను. ఆ తత్వాన్ని నేను తెలుసుకున్నాను. నా విశ్వాసం జాగృతమైంది. ఆ తత్త్వం గురించి తెలుసుకోలేని అజ్ఞానిని ఏమని పిలవాలి? నమ్మని గ్రుడ్డివానిని ఏం చేయాలి?"

* * *

2) " ఓ జీవుడా ! భగవంతుడు తప్ప నీకు వేరెవరూ లేరు. ఈ ప్రపంచంలో నువ్వు ఎవ్వరినీ నీ వారు అని అనుకుంటున్నావు? గొప్ప కులంలో పుట్టాను అనే అభిమానాన్ని వదలిపెట్టు. ఈ అబద్ధపు భ్రమలో నిన్ను నువ్వు మర్చిపోయావు. అశాశ్వతమైన ఈ శరీరాన్ని చూసి ఎంత ఆనందపడుతున్నావు! అది ఒక్క క్షణంలోనే నాశనమైపోతుంది. ఎప్పటివరకైతే మనస్సులో వికారాలు వుంటాయో అప్పటివరకు ఈ సంసారం నుంచి ముక్తి లభించదు. ఎపుడైతే మనస్సు నిర్మలమవుతుందో అప్పుడే నిర్మల పరమతత్త్వంలో లీనమవుతుంది. జ్ఞానం అనే అగ్నే వాస్తవంలో బ్రహ్మ. హరి లేకుండా ఎవ్వరూ లేరు. ఎపుడైతే పాప పుణ్యముల భ్రమ అణిగిపోతుందో భగవంతుని యొక్క ప్రకాశం మిగిలి ఉంటుంది. ఎవరి మనస్సులో ఈశ్వరుని పట్ల ఎలాంటి భావం వుందో అతడు అదే రూపంలో లభిస్తాడు. నీ భ్రమలన్నీ విడిచిపెట్టు. రాముడు ఏదిచేస్తే అదే అవుతుంది. ఈ నమ్మకంతోనే ఉండు."

* * *

3) " లోపల మనస్సులో మలినాలన్నింటిని ఉంచుకుని ఈ శరీరాన్ని తీర్థ స్థలాల్లో స్నానం చేయటం ద్వారా శుద్ధంగా ఉంచుకోవటం వలన ఏం లాభం? ఎవరి మనసైతే జ్ఞానంతోనూ, హృదయం శుద్ధతతోనూ ఉంటుందో వారికి తీర్థ స్థలాల్లో స్నానం ఎందుకు? కమండలాలను 86 తీర్థాలలో ముంచి స్నానం ఆచరించినా దాని మురికి ఎక్కడికీ పోదు. ఒక్క మురారి ద్వారా మాత్రమే ఈ భవ సాగరం నుంచి తరించగలం."

* * *

4) " మురారీ ! ఈ ప్రజలు కాశీని ఎప్పుడు వదులుతారు? నిజమైన నిన్ను తెలుసుకోలేక నీనుంచి తప్పించుకు తిరుగుతున్నారు. యోగి, యతి, తపస్వి, సన్యాసి మఠాల్లోనూ, దేవాలయాలోనూ ఉంటూ నిజమైన విశ్వాసం లేకుండా ఉన్నారు. రోజుకు 3సార్లు గంగలో స్నానం చేస్తుంటారు. కానీ, శరీరం లోపల ఉండే మలినాల గురించి పట్టించుకోవటం లేదు. గుడులు, గోపురాలు చుట్టూ తిరుగుతున్నారు కానీ నిరాకార నిరంజనుని గురించి ఆలోచించడం లేదు." కబీర్ అంటున్నాడు: " భగవంతుని చరణాల ద్వారా లభించిన కీర్తిని నేను కాశీకి ఇవ్వను."

* * *

5) “ రాముడు మరి సద్గురువును సేవించటమే సత్యం. నిరంజన్ రాముని పూజించు. నీటిలో స్నానం చేయటం వలనే సద్గతి లభిస్తే ఆ స్థితి నిత్యం నీటిలో ఉండే చేపలకు లభించాలి. ఏ విధంగానైతే నీటిలో ఉండే చేపలకు మోక్షం లభించటం లేదో అదే విధంగా మనుష్యులు తీర్థ స్థలాల్లో స్నానము చేయటం వలన మోక్షాన్ని పొందలేరు. మళ్ళీ మళ్ళీ జన్మించటం కోసం రావాల్సిందే. మనస్సులో మలినాలు పెట్టుకుని తీర్థాల్లో స్నానం చేసినప్పటికీ అతడు వైకుంఠాన్ని చేరలేడు. వేషాలు వేసే మోసపూరిత సాధువులకు రాముడు మోక్షాన్నివ్వడు. హృదయంలో కఠోరత్వాన్ని ఉంచుకుని కాశీలో మరణించినా నరకం నుంచి తప్పించుకోలేరు. హరి యొక్క దాసులు మగ్‌హరిలో (కబీర్ దేహం విడిచిన ఊరు) మరణించినప్పటికీ సమూహంతో పాటు ముక్తిని పొందుతారు. స్తోత్ర పాఠాలు, పురాణ వచనాలు వేదాధ్యయన, స్మృతి పారాయణంతో నిరంకారుని దర్శనం జరగదు. ప్రపంచంలో పిచ్చివారిలా అనేక దేవతలను పూజిస్తున్నారు. ఉన్న ఒక్కడినే పూజించండి” అని కబీర్ అంటున్నాడు.

## అద్వైతం

“ ఓ రామా! నాకు నీ పట్ల ఏ ఆరాధన ఉందో అది ఎలా పోతుంది? ఏ విధంగానైతే వజ్రం కొట్టటం వలన ఎలా బ్రద్దలు కాదో అదే విధంగా మన కలయికను విడదీయటం అసాధ్యం ! మన ఇద్దరి సంబంధం సృష్టి ఆది నుంచి అంతం వరకు ఉంటుంది. అది ఎలా దూరం అవుతుంది? ఏ విధంగానైతే తామరాకు నీటిలో నివాసం వుంటుందో, అదే విధంగా స్వామికి సేవకునికి సంబంధం వుంటుంది. మన ఇద్దరి సంబంధం కీటకం భ్రమరం మరి సముద్రం నదిలా విడదీయ రానిది. ఏ విధంగానైతే  బంగారంలో వెలిగారం (ఔళిజీబిని) కలిసిపోయి ఉంటుందో నా మనస్సు ఈశ్వరునిలో లీనమై ఉంటుంది.”

## సహస్రారం..పరమాత్మ స్థానం

1) “ నరహరి యొక్క ధ్యానం చేయండి. అనాహత శబ్దం యొక్క చింతన చేయండి. ముందు పంచప్రాణాలను వెదుకు. శరీరాన్ని ప్రాణంలా చేసి శూన్యంలో శ్వాసతో, కలిసిపో. రెండు కనుబొమ్మల మధ్య జ్యోతి దర్శనం కలుగుతుంది. ఈ జ్యోతితో శ్వాసను, సూర్యచంద్ర నాడులను కలుపు. మనస్సు స్థిరమైతే సహస్రదళ కమలం ప్రకాశిస్తుంది. ఆ కమలమే నిరంజనుని యొక్క నివాసం. సద్గురువు ఈ రహస్యాన్ని విప్పి చూపించాడు. ఎవరికైతే గురువు లేడో వారికి ఈ రహస్యం ఎవరు చెపుతారు? సహజత్వాన్ని లక్ష్యం చేసుకుని మిగిలిన వాటిని విడిచిపెట్టేయ్. ఆసనం పై దృఢంగా కూర్చుని సమాధి సాధన చేయి.” కబీర్ అంటున్నాడు: “ సహస్రార

కమలం మధ్యలోనే మణి ఉంది. అక్కడే త్రిభువన పతి యొక్క నివాసం వుంది.”

* * *

2) “ ఎక్కడ నుంచి జీవుడు ఈ ప్రపంచంలోకి వస్తున్నాడో, శరీరాన్ని విడిచిన తరువాత ఆత్మ వెళ్ళిపోయి ఎక్కడ లయమవుతుందో.. ఆ ఇంటి గురించి ఎవ్వరూ చెప్పడం లేదు. ఈ భూమి, ఆకాశం, గాలి, నీరు, మొట్ట మొదటి మాయ కూడా లేదు. అప్పుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు లేరు. అప్పుడు జీవుడు ఎక్కడ నుంచి వచ్చాడు? అహంకారం, మమకారం మరి ‘నాది’ అనే భావన కారణంగా జీవుడు మళ్ళీ మళ్ళీ పశ్చాత్తాపపడాలి. స్వామి నామం పై లక్ష్యంలేని కారణంగా పదే పదే దెబ్బలు తినాల్సి వస్తుంది. నేను ప్రియతముని పట్ల ఇష్టాన్ని పెంచుకున్నాను. నేను మనస్సును సంసారం నుంచి మరల్చి నిరంజనుని యొక్క ధ్యానంలో ఉంచాను. ఓ సాధువుల్లారా! వినండి ఆ ఇంటిని.. (ఎక్కడ నుంచైతే జీవుడు వస్తాడో..) అసాధారణమైన వారు మాత్రమే పొందగలరు.”

## నిజమైన కర్త

“ ఎవరికైతే జనన - మరణాలు లేవో.. రావటం - పోవటం లేదో.. ఎవరైతే భూమి – ఆకాశం, సమస్త బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్నాడో.. ఏ కర్మలకూ బందీ కాడో.. ఆ పరమతత్వం గురించి విచారణ చేయి. అతడు నాద (ధ్వని) బిందు (శరీరము) రహితుడు.. అతడే నా స్వామి. రాముని తండ్రి దశరథుడైతే రాముని తాత ఎక్కడ నుంచి వచ్చాడు? రాధా, రుక్మిణి కృష్ణుని యొక్క రాణులు. కృష్ణుడు ఇద్దరి స్వామి. 14వేల మంది గోపికలతో అతను భోగించాడు. వసుదేవుడు తండ్రి, దేవకి తల్లి నందగోపుని ఇంట పెంపకం కోసం తీసుకురాబడ్డాడు. ఎవరైతే కర్మలతో బంధింపబడ్డారో అతడు నిజమైన కర్త కాడు.”

## జీవాత్మ

“ దేహ రూపంలో ఉన్న ఈ వృక్షంలో జీవాత్మ అనే పక్షి. విషయ భోగాలలో ఊగుతూ నివసిస్తోంది. అది ఏ భావంతో మాట్లాడుతుందో దాని కలయిక గురించి ఎవ్వరికీ తెలియదు. చెట్టు కొమ్మపై వున్న నీడలో ఈ పక్షి నివాసం ఏర్పరుచుకుంది. అది సాయంకాలం వస్తుంది, ఉదయాన్నే ఎగిరిపోతుంది. అది తన రహస్యాన్ని ఎవ్వరికీ చెప్పలేదు. దానికి వర్ణ, అవర్ణం అనేవి లేవు. అది ప్రేమ యొక్క నీడలో కూర్చుని ఉంది. అది అగమ్యం, అపారం. శాశ్వత చైతన్యం. రావటం వెళ్ళటం అనేవి దానికి లేవు. కబీర్ అంటున్నాడు: “ఇది అగమ్య కథ.. ఈ జీవాత్మరూపంలో ఉన్న పక్షి యొక్క స్థానం ఏది? దానిని తెలుసుకునే పని చేయి! తెలుసుకున్న వాడు జ్ఞాని.”

# సహజ సమాధి

కబీరు అంటున్నాడు: “ ఓ సాధూ ! సహజ సమాధి మాత్రమే ఉత్తమమైనది. సాయి సాక్షాత్కారం కలిగినప్పటి నుంచి నాకేమీ గుర్తుండడం లేదు. కళ్ళు మూతలు పడటం లేదు. చెవులకేమీ వినబడటం లేదు. భౌతిక బాధలు బాధించడంలేదు. తెరుచుకున్న కన్నుల ముందర నవ్వుతున్న సుందర రూపాలే దర్శనం ఇస్తున్నాయి. నా నోటి నుంచి వచ్చే మాటలన్నీ ఈశ్వర సంబంధమై ఉన్నాయి. ఏ పనిచేస్తున్నా అదే ‘పూజ’ అయిపోతుంది. ఇల్లునూ వనాన్నీ సమభావంతో చూడగల్గుతున్నాను. ద్వైత భావం పోయింది. ఎక్కడెక్కడకు వెళుతున్నా అది ‘ప్రదక్షిణం’ అవుతోంది. ఏ పని చేస్తున్నా అది ఈశ్వర సేవ అవుతోంది. నిద్రిస్తూ ఉంటే అదీ భగవంతునికి ప్రణామం అవుతోంది. అనాహత నాదం పట్లే నా దృష్టి ఉంటోంది. ఇతర దేవతలను పూజించాల్సిన పని లేదు. విషపూరితమైన మాటలను త్యాగం చేశాను. కూర్చున్నా, లేచినా ఆ పరమ తత్వాన్ని మర్చిపోకుండా ఉన్నాను. అటువంటి ఉన్మత్త స్థితిలో ఉన్న నా స్థితిని నేను ప్రకటిస్తున్నాను. సామాన్య సుఖదుఃఖాలకు అతీతమైన పరమ సుఖం ఒకటున్నది ! నేను దానిలో కలసిపోయి ఉన్నాను.”

# స్వయంకృతాపరాధం

“ మనమే స్వయంగా మన ఆత్మతత్వాన్ని మర్చిపోయాం. ఏ విధంగానైతే కుక్క అద్దాల గదిలో తన ప్రతి బింబాన్నే చూసుకుని మొరిగి మొరిగి మరణిస్తుందో.. సింహం నూతిలోని నీటిలో తన ప్రతిబింబాన్ని చూసి దానితో దెబ్బలాడాలని నూతిలో ఉరుకుతుందో.. అదే విధంగా ఒకానొక మత్తెక్కిన ఏనుగు స్ఫటిక శిలపై తన బింబాన్ని చూచి దానిని తన దంతాలతో పొడిచి దెబ్బలాడుతుంది. కోతి తినటం కోసం చేతినిండా ధ్యానం ఉంచుకుని పాత్రలోంచి చేయి రాని  కారణంగా దుకాణదారునికి దొరికి ఇంటింటికీ తిరుగుతూ దెబ్బలు తింటూ ఉంటుంది. లోహపు కడ్డీమీద కూర్చున్న రామచిలుక ఎటువంటి పరిస్థితులలోను ఈ లోహపు కడ్డీని విడువకుండా పట్టుకుని ఆ లోహపు కడ్డీ తనను పట్టుకుంది అని భ్రమపడుతూ అలానే కూర్చుంటుంది. అదేవిధంగా జీవుడు సంసారం యొక్క మాయా మోహంలో స్వయంగా పడ్డాడు.”

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) కర్మ సిద్ధాంతం - రూ.80/-
19) ధ్యానమంటే ? - రూ.80/-
20) త్రివిధాలు - రూ.80/-
21) ఉత్తమ పురుషుడు - రూ.80/-
22) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
23) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
24) జ్ఞాన జ్యోతి - రూ.70/-
25) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
26) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
27) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
28) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
29) బుద్ధుని సందేశాలు - రూ.70/-
30) భూతదయే దైవత్వం - రూ.70/-
31) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
32) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
33) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
34) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
35) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
36) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
37) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
38) అతీంద్రియ శక్తులు - రూ.60/-
39) ఆలోచించండి - రూ.60/-
40) నిర్వాణ మార్గం - రూ.60/-
41) ధ్యానులకు సూచనలు - రూ.60/-
42) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
43) సంకల్పమంటే? - రూ.50/-
44) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
45) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
46) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.50/-
47) మహాత్ముల సందేశాలు - రూ.40/-
48) సత్యం - రూ.40/-
49) చక్రాలు - రూ.40/-
50) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
51) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
51) మౌన ధ్యానం - రూ.40/-
53) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా?-రూ.20/-
54) శాకాహారమే మానవాహారం - రూ.15/-
55) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



"రేపు చేయాల్సిన పనిని ఈ రోజే చేయి. ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేయి. క్షణంలో ప్రళయం రావచ్చు. ఇక ఎప్పుడు చేస్తావు?"

* * *

"పడవలో నీరు నిండినప్పుడు, ఇంటిలో ధనం ఎక్కువ వున్నప్పుడు వెంటనే రెండు చేతులతో దానిని బయటకు పారబ్రోయాలి. ఇదే బుద్ధిమంతుల పని"

* * *

"ఇతరుల దోషాలను చూసి నవ్వే ప్రజలు, తమ చిత్తాన్ని ఒక్కసారి చూసుకుంటే తమలోని అనంత దోషాలను గుర్తించగలరు".

* * *

"మనిషి ఖర్జూర చెట్టులా ఎత్తుగా వుండి లాభమేమిటి? బాటసారికి అది నీడ ఇవ్వలేదు, ఫలాలేమో చాలా దూరంలో వుంటాయి".

* * *

"ప్రజలు సత్యాన్ని నమ్మకుండా, అసత్యం పట్ల విశ్వాసంగా వున్నారు. లోకంలో మద్యం కూర్చుని అమ్ముతుండగా, పాలు, పెరుగును వీధి, వీధి తిరిగి అమ్మవలసి వస్తోంది."

* * *

"ఎవరైతే నీ మార్గంలో ముళ్ళు జల్లి నీకు అపకారం చేస్తారో, వారికి నీవు పూలు చల్లి ఉపకారమే చేయి, నీ మార్గంలో పూలకు పూలే వస్తాయి, వారికి ముళ్ళే లభిస్తాయి".

* * *

"తలవెంట్రుకలను 100 సార్లు ఎందుకు కత్తిరించుకుంటున్నావు? అంతకంటే మనస్సులో వున్న విషయ, వికారాలను కత్తిరించుకో!"

రూ.70/-

\- కబీరు